
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు

ఆదివారం 4 ఆగస్టు 2024





సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి పెమ్మసాని, మంత్రి మనోహర్, చైర్‌పర్సన్ క్రిస్టినా

అభివృద్ధి దిశగా అడుగులు

- కులమతాలు, పార్టీలను పక్కన పెట్టాలి
- కేంద్రం నుంచి వీలైనన్ని ఎక్కువ నిధులు తీసుకువస్తా
- గ్రామాల అభివృద్ధికి ఉపాధి నిధులు వినియోగించుకోవాలి
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని
- గుంటూరు జిల్లాకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి : మంత్రి నాదెండ్ల మనోహర్

గుంటూరు సిటీ, ఆగస్టు 3: రాజకీయాలు ఎన్నికల వరకే. ప్రస్తుతం పార్టీలను పక్కన పెట్టేద్దాం. కులమతాలకు, పార్టీలకు అతీతంగా జిల్లాను అభివృద్ధి చేసుకునేందుకు అడుగులు ముందుకేద్దాం.. అని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపు ఇచ్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా అధ్యక్షతన జరిగిన సమావేశంలో పెమ్మసాని మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి కోసం కేంద్రం నుంచి వీలైనన్ని ఎక్కువ నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామీణ సడక్ యోజన కింద రోడ్లు లేని ప్రాంతాలకు రోడ్ల నిర్మించుకునే అవకాశం కూడా ఉందని తెలిపారు. ఉపాధి హామీ నిధులను సద్వినియోగ పరుచుకుని గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఉపాధి హామీ పథకం కింద రోడ్లు, చెరువులు, కాల్వలు నిర్మించుకునే అవకాశం ఉందన్నారు. ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రానికి ప్రతి సంవత్సరం రూ.6 వేల నుంచి రూ.7 వేల కోట్లు తెచ్చుకునే అవకాశం ఉందన్నారు. ప్రతి పేదవాడికి ఉండటానికి ఒక ఇంటిని ఇవ్వాలన్న ఆలోచనతోనే నిబంధనలు కూడా సవరించామని తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేసుకోవడం కోసం విలువలతో కూడిన రాజకీయాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొందన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అభివృద్ధి, సంక్షేమం కోసం పార్టీలకతీతంగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. జడ్పీటీసీలు అభివృద్ధిని అడ్డుకోవద్దని, అర్హత కలిగిన వారికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని నాదెండ్ల సూచించారు. అందరూ కలిసి ఉమ్మడి గుంటూరు జిల్లా పూర్వ వైభవానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు మాట్లాడుతూ ఎంపీపీ, జడ్పీటీసీల గౌరవ వేతనం రూ.20 వేలకు పెంచేలా చూడాలని కోరారు. 2022, 23 సంవత్సరాలకు సంబంధించిన మైనింగ్ సెస్సు మండల పరిషత్‌లకు రాలేదని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవి విడుదలయ్యేలా చూడాలని కోరారు.

రూ.100 కోట్లు రావాలి : చైర్మన్

జిల్లా పరిషత్‌కు న్యాయబద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.100 కోట్లు రావాల్సిందని జడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా పరిషత్ భవనం కూలిపోయే పరిస్థితుల్లో ఉందని పాత ముఖ్యమంత్రిని ఎన్ని సార్లు కలిసినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన చెందారు. న్యాయబద్ధంగా రావాల్సిన నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టించడంతో జడ్పీటీసీలకు నిధులు కేటాయించలేక పోయామన్నారు. గత ప్రభుత్వ హయాంలో తమకు పదవులు అలంకారప్రాయంగా మాత్రమే మిగిలి పోయాయని చెప్పారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థల నిధులను పక్కదారి పట్టించడం వల్ల గ్రామాభివృద్ధి పూర్తిగా కుంటుబడిపోయిందన్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ కౌలు రైతుల కార్డులు, అంటువ్యాధులు, విద్యాశాఖలో సమస్యలు తదితర అంశాలను అజెండాలో చేర్చాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ పనుల్లో లోపాలు ఉంటే విచారణ చేపట్టాలని ఎమ్మెల్సీ యేసురత్నం తెలిపారు. కక్షసాధింపులకు పాల్పడకుండా అభివృద్ధితో ముందుకు వెళ్లాలన్నారు.

జగనన్న కాలనీల్లో అవినీతి : ఆనందబాబు

జగనన్న కాలనీల్లో భారీగా అవినీతి జరిగిందని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆరోపించారు. కాలనీలో లెవెలింగ్ పనుల పేరుతో కోటానుకోట్లు అవినీతి చేశారన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల స్థానిక స్వపరిపాలన సంస్థలు నిర్లక్ష్యానికి గురయ్యాయని తెలిపారు. స్థానిక సంస్థల్లో ఉన్న ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యేలతో మమేకం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

జల్ జీవన్ పనుల్లో లోపాలు : శ్రావణ్‌కుమార్

జల్ జీవన్ పనుల్లో లోపాలు ఉన్నాయని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ తెలిపారు. ఈ పనుల కోసం అన్ని గ్రామాల్లో ఉన్న సిమెంట్ రోడ్లను పగలగొట్టి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. తాడికొండ నియోజకవర్గంలో వేసవిలో తాగునీటికి ఇబ్బంది ఉందని చెప్పారు. వచ్చే సమావేశంలో ఈ పనులపై ప్రత్యేకంగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు.

వెంటిలేటర్‌పై పల్నాడు : జూలకంటి

అభివృద్ధిలో అన్ని విధాల వెనుకబడిన పల్నాడు జిల్లా వెంటిలేటర్ మీద ఉన్న పేషంట్‌లా ఉందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్ నిధులు కేటాయించే విధానంలో పల్నాడుకు అన్యాయం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఐదు మండలాలు కలిగిన మాచర్లకు కేవలం రూ.8 కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. మిగిలిన నియోజకవర్గాల్లో రెండు మండలాలకు రూ.8 కోట్లు కేటాయించిన ఉదంతాలు ఉన్నాయన్నారు. కూత వేటు దూరంలోనే నాగార్జునసాగర్ ఉన్నప్పటికీ ఆ నీళ్లను తాగలేని పరిస్థితి మాచర్ల నియోజకవర్గంలోని ప్రజలదని ఆవేదన వ్యక్తం చేశారు.

టిడ్కో ఇళ్లు పూర్తి చేయాలి : అరవిందబాబు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు మధ్యలో ఆగిపోయాయని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇళ్ల నిర్మాణాలను ఆపేసిందని, పూర్తి అయిన ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వడంలో జాప్యం చేసిందన్నారు. నరసరావుపేటలో 6000 కుపైగా ఇళ్ళు అసంపూర్ణ దశలో ఉన్నాయని తెలిపారు.

జడ్పీటీసీలు కలిసి రావాలి : ప్రవీణ్

గ్రామాల అభివృద్ధి కోసం జడ్పీటీసీలు ఎమ్మెల్యేలతో కలిసి రావాల్సిన అవసరం ఉందని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎంతో దుర్మార్గంగా జరిగాయన్నారు. వచ్చే జడ్పీ సమావేశంలో ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు అందరూ పాల్గొనేలా చూడాలని చైర్ పర్సన్‌ను కోరారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యేలు ప్రవీణ్, శ్రావణ్‌కుమార్, అరవిందబాబు, బ్రహ్మారెడ్డి, ఆనందబాబు, నరేంద్రవర్మ, ఎమ్మెల్సీలు ఏసురత్నం, లక్ష్మణరావు

2.5 లక్షల ఇళ్లకు 70 వేలే నిర్మాణం

గత ప్రభుత్వంలో కేంద్రం రాష్ట్రానికి రెండున్నర లక్షల ఇళ్లు మంజూరు చేసింది. అయితే ఐదేళ్ల జగన్ ప్రభుత్వం హయాంలో కేవలం 70 వేల ఇళ్లు మాత్రమే నిర్మాణం జరిగాయి. వాటికి కూడా ఒకటి, రెండు వాయిదాలు మాత్రమే లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారు. తాజా బడ్జెట్ వల్ల రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు 10 లక్షలు, పట్టణ ప్రాంతాలకు మరో ఐదు లక్షల ఇళ్లు మంజూరయ్యే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రూ.800 కోట్లు కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖలో ఉన్నాయి. వాటికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన మ్యాచింగ్ ఫండ్ ఇస్తే ఆ నిధులు వచ్చే అవకాశం ఉంది. జలజీవన్ మిషన్ ద్వారా రాష్ట్రానికి రూ.14 వేల కోట్లు మంజూరైతే గత ప్రభుత్వంలో కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే వినియోగించింది. మ్యాచింగ్ గ్రాంట్‌గా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన సొమ్మును ఏ రీతిగా చెల్లించాలి అనే దానిపై సీఎం చంద్రబాబు ఆలోచన చేస్తున్నారు.

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

స్టాడింగ్ కమిటీ సభ్యులు ఎంపిక

జడ్పీ సర్వసభ్య సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎంపిక చేశారు.

ప్రణాళిక, ఆర్థిక స్టాండింగ్ కమిటీ : ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు
గ్రామీణాభివృద్ధి : కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, జీవీ ఆంజనేయులు
వ్యవసాయం : ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, బూర్ల రామాంజనేయులు
విద్య, వైద్యం: మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, జూలకంటి బ్రహ్మారెడ్డి
మహిళా సంక్షేమం: ఎమ్మెల్యేలు యరపతినేనిశ్రీనివాసరావు, ప్రత్తిపాటి పుల్లారావు
సాంఘిక సంక్షేమం: ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నరేంద్రకుమార్
పనులు: మంత్రి సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, శ్రావణ్‌కుమార్

కృష్ణమ్మ.. వడివడిగా

- సాగర్‌కు పోటెత్తుతోన్న వరద
- 3.91 లక్షల కూసెక్కుల ప్రవాహం
- 570 అడుగుల అడుగులకు చేరిన మట్టం
- రెండు రోజుల్లో తెరుచుకోనున్న సాగర్ గేట్లు
- రెండు రోజుల్లో నిండుకుండలా పులిచింతల



పులిచింతల నుంచి విడుదలవుతున్న నీరు

నరసరావుపేట(ఆంధ్రజ్యోతి), కారంపూడి, ఆగస్టు 3: కృష్ణమ్మ.. పరుగులు పెడుతూ వస్తోంది. పోటెత్తిన వరదతో జలా శయాలు నిండుకుండల్లా మారుతున్నాయి. ప్రాజెక్టు గేట్లు తెరుచుకుని నాగార్జున సాగర్ దిశగా పరవళ్లు తొక్కుతూ పయనం సాగిస్తోంది. భారీగా వరద నీరు వస్తుండటంతో సాగర్ జలాశయం జలకళను సంతరించుకుంది. సాగర్ జలాశయంలోకి శనివారం రాత్రి 9 గంటలకు 4,57,923 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. డ్యాం సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా రాత్రికి నీటి నిల్వ 250.14 టీఎంసీలకు చేరింది. సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా 570 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి సాగర్‌కు 5.34 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌కు వరద వారం రోజులకు పైగా కొనసాగుతుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. ఆదివారానికి ఐదు లక్షల క్యూసెక్కుల నీరు సాగర్‌కు వస్తుందని అంచనా. ఇదే ప్రవాహం కొనసాగితే రెండు మూడు రోజుల్లో సాగర్ క్రస్ట్ గేట్లు తెరచి నీటిని దిగువకు విడుదల చేయనున్నారు. ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, తుంగభద్ర జలాశయాల నుంచి నాలుగున్నర లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. నాలుగు రోజుల్లో సాగర్‌కు 76.23 టీఎంసీల నీరు వచ్చింది. శ్రీశైలం సహా ఎగువ ప్రాజెక్టుల నుంచి విడుదల చేస్తున్న వరద నీటిని లెక్కిస్తే సాగర్ రెండు రోజుల్లో నిండుతుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. సాగర్ నుంచి 31,510 విద్యుదుత్పత్తి ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి చేస్తూ కుడి కాల్వకు 5,944 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. బుగ్గవాగుకు 5,190 క్యూసెక్కుల నీరు వస్తుండగా ఇక్కడ నుంచి కుడి కాల్వకు 4,923 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

పులిచింతలకు 25332 క్యూసెక్కులు విడుదల

పులిచింతల జలాశయానికి కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. దీంతో సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 0.9398 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్‌ఈ వెంకటరమణ చెప్పారు. సాగర్ నుంచి విద్యుదుత్పత్తి అనంతరం 27507 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు వస్తుందన్నారు. దీంతో రిజర్వాయర్‌లో 75.02 మీటర్లు అంటే 6.751 టీఎంసీల నీరుందన్నారు. డ్యాంకు సంబంధించి 4 క్రస్ట్‌గేట్లు 1 మీటర్ మేర ఎత్తి పులిచింతలకు 17048 క్యూసెక్కులు, విద్యుత్ తయారీ అనంతరం టేల్ రేస్ ఛానల్ ద్వారా 8284 క్యూసెక్కులు మొత్తం 25332 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. వరద ముంచెత్తుతుండటంతో రెంటచింతల తహశీల్దార్ కరుణకుమార్ శనివారం టెయిల్‌పాండ్ ప్రాజెక్టును సందర్శించారు. సుమారు 1900 హెక్టార్లలో ఉన్న రిజర్వాయర్ పూర్తిగా నీటితో నిండిపోయింది. ఎగువ నుంచి వచ్చిన నీటికి అదనంగా మరికొన్ని క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఎస్‌ఈ వెంకటరమణ చెప్పారు. విద్యుదుత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు. డ్యాంకున్న 20 క్రస్ట్ గేట్లలో 18 గేట్లను సోమవారం సాయంత్రానికి ఎత్తే అవకాశం ఉందని సూచన ప్రాయంగా చెప్పారు. కేఎల్‌రావ్ పులిచింతల జలాశయంలో పూర్తి సామర్థ్యం 45.77 టీఎంసీలకు 3.38 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇక్కడకు 25,982 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఇక్కడ నుంచి దిగువకు 3,275 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పులిచింతల జలాశయం త్వరలోనే నిండే అవకాశాలు ఉన్నాయి.



ఈపూరు ప్రాంతంలో నారు మళ్లు

సాగునీటి విడుదలకు ఆదేశాలు..

సాగర్ కుడి కాల్వ ఆయకట్టు పరిధిలో సాగుకు నీరు ఇవ్వాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శనివారం అధికారులను ఆదేశించారు. రైతులు నారుమళ్లు సాగు చేసుకునేందుకు ఏర్పాట్లు చేయలన్నారు.



నాగార్జున సాగర్ జలాశయం జలకళ

ఈ పరిస్థితుల్లో వరి సాగుకు ఈ ఏడాది పుష్కలంగా సాగు నీరు సరఫరా కానున్నది. ఆయకట్టులో అన్నదాతలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని 11.16 లక్షల ఎకరాలకు సాగు నీరు సరఫరా కానున్నది. దీంతో ఖరీఫ్‌లో సాగునీటి కష్టాలు తీరనున్నాయి. సాగునీటి కొరతతో గత ఏడాది ఆయకట్టులో వరి సాగుకు విరామం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది సాగర్ జలాశయానికి భారీగా వరద నీరు వస్తుండటంతో సాగుకు పుష్కలంగా నీరు అందుబాటులోకి వస్తోంది. ఖరీఫ్‌లో వరి సాగుకు నీరు ఇస్తున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు కూడా ప్రకటించారు. ఆశాభావంగా వర్షాలు, జలశయాలకు నీరు భారీగా వస్తుండటంతో ఇప్పటికే వరి నారుమళ్ల సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో ఇప్పటికే విస్తృతంగా రైతులు వరి నారు మళ్లు సాగు చేశారు. కాల్వకు నీరు విడుదల చేస్తుండటంతో ఆయా ప్రాంతాల్లో నాట్లు కూడా ప్రారంభంకానున్నాయి. పల్నాడు జిల్లాలో 5.71 లక్షల ఎకరాలు, గుంటూరు 95 వేల ఎకరాలు, బాపట్ల 1.88 లక్షల ఎకరాలు, ప్రకాశం జిల్లాలో 2.60 లక్షల ఎకరాలకు సాగు నీరు పుష్కలంగా సరఫరా కానున్నది.

తొలిగిన అడ్డంకి

- ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి సిద్ధం
- ఈ నెల 6 నుంచి రాత పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు
- హైకోర్టులో రిట్‌ని ఉపసంహరించుకున్న పిటిషనర్లు

గుంటూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల్లో హైకోర్టు కేసు కారణంగా వాయిదాపడిన 20 పోస్టుల నియామక ప్రక్రియకు అడ్డంకులు తొలిగిపోయాయి. ఎవరైతే పిటిషన్ వేశారో వారు దానిని ఉపసంహరించుకోవడంతో ప్రస్తుత దశలో ఎలాంటి అభ్యంతరాలు లేవు. దీంతో సత్వరమే ఆయా పోస్టులను భర్తీ చేయాలని గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు అభ్యర్థులకు రాత పరీక్షలు నిర్వహిం చేందుకు అధికార యంత్రాంగం తేదీలను ఖరారు చేసింది. నియామక ప్రక్రియలో గత అనుభవాల దృష్ట్యా ఈ దఫా పకడ్బందీగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉన్నది. లేకుంటే గతంలో వలే అనేక ఆరోపణలు, కోర్టు కేసులు దాఖలయ్యే అవకాశం లేకపోలేదు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా మొత్తం 54 ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ ఖాళీల భర్తీకి గత సంవత్సరం నియామక ప్రక్రియ చేపట్టారు. అందులో 34 పోస్టుల నియామకాలను పూర్తి చేశారు. నియామక ప్రక్రియ పూర్తి అయిన తర్వాత అధికారులపై అనేక ఆరోపణలు వచ్చాయి. కాగా నోటిఫికేషన్‌లో 20 పోస్టులకు సంబంధించి హైకోర్టులో కేసు దాఖలు కావడంతో నియామక ప్రక్రియ నిలిచిపోయింది. అయితే పిటిషనర్లు హైకోర్టులో రిట్‌ను ఉపసంహరించుకు న్నారు. ఈ క్రమంలో ఆయా పోస్టుల భర్తీకి అధికారులు సిద్ధమయ్యారు. దీంతో తొలుత రాత పరీక్షకు సంబంధించి ఏర్పాట్లు చేశారు. ఒక డ్రెయిన్ క్లీనర్, రెండు గ్యాంగ్ మజ్దూర్, 12 పబ్లిక్ హెల్త్ వర్కర్, మూడు స్వీపర్, ఒక హోల్‌టైం సర్వెంట్, ఒక కలాసి పోస్టులున్నాయి. డ్రెయిన్ క్లీనర్ పోస్టుకి 86, గ్యాంగ్ మజ్దూర్ పోస్టులకు 385, పీహెచ్ వర్కర్ పోస్టులకు 2,840, స్వీపర్ పోస్టులకు 974, హోల్‌టైం సర్వెంట్‌కు 235, కలాసికి 596 దరఖాస్తులు అందాయి. అభ్యర్థులకు చదవడం, రాయడం పరీక్షను సిద్ధార్థనగర్‌లోని జేసీ కాలేజ్ ఆఫ్ లాలో నిర్వహించాలని నిర్ణయించారు. డ్రెయిన్ క్లీనర్ పోస్టు అభ్యర్థులకు ఈ నెల 6న ఉదయం 10.30కు, గ్యాంగ్ మజ్దూర్ పోస్టుల అభ్యర్థులకు అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి పరీక్ష నిర్వహిస్తారు. పీహెచ్ వర్కర్ పోస్టులకు అభ్యర్థులు అధిక సంఖ్యలో ఉన్నందున వచ్చే బుధ, గురు, శుక్రవారాల్లో రోల్ నెంబర్ల వారీగా కేటాయించిన సమయాల్లో జరుగుతాయి. స్వీపర్ పోస్టు అభ్యర్థులకు ఈ నెల 12న, హోల్ టైం సర్వెంట్, కలాసి పోస్టుల అభ్యర్థులకు 13న పరీక్ష నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఎలాంటి ఆరోపణలకు తావివ్వకుండా పరీక్షలను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలన్నారు.

పునాదుల పటిష్టతపై పరిశీలన

రాజధానిలో మద్రాసు ఐఐటీ నిపుణుల బృందం



సచివాలయం భవనాల నిర్మాణ కాంక్రీట్ ఫౌండేషన్‌ను బోటులో వెళ్లి పరిశీలిస్తున్న మద్రాసు ఐఐటీ ఇంజనీరింగ్ బృందం



తుళ్లూరు, ఆగస్టు 3: రాజధాని అమరావతిలో వివిధ దశల్లో నిలిచిపోయిన పలు భవన నిర్మాణాల స్థితి గతులపై ఐఐటీ నిపుణుల బృందం అధ్యయనం కొనసాగుతోంది. తొలిరోజు ఐఐటీ హైదరాబాద్ బృందం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఆలిండియా సర్వీస్ ఉద్యోగులు, గ్రూప్- 1, 2, క్లాస్-4 ఉద్యోగుల భవన సముదాయాలను పరిశీలించగా, రెండో రోజు శనివారం మద్రాస్ ఐఐటీకి చెందిన నిపుణుల బృందం కోర్ క్యాపిటల్లో గత టీడీపీ ప్రభుత్వం చేపట్టిన సచివాలయ, ఐకానిక్ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు భవన పునాదుల పటిష్టతను పరిశీలించింది. మద్రాస్ ఐఐటీ ఇంజనీరింగ్ విభాగాధిపతి మెహర్‌ప్రసాద్, కరోషన్ ఇంజనీర్ రాధాకృష్ణ పిళ్లై, సాయిల్ అండ్ ఫౌండేషన్ ఎక్స్‌పర్ట్ సుదీప్ బెనర్జీతో కూడిన ముగ్గురు సభ్యుల బృందం నీటిలో నానుతున్న ఆయా పునాదులను పరిశీలించింది. వైసీపీ ప్రభుత్వం ఆయా పునాదులను నీటిలో నానబెట్టి ఐరన్ తుప్పుపట్టేలా చేసిన విషయం తెలిసిందే. ఇటీవల కురిసిన వర్షాలకు అందులోకి భారీగా నీరు చేరగా ఎన్‌డీఆర్‌ఎఫ్ పడవలో నిపుణుల బృందం నీటిలో మునిగిన పునాదులు, కాంక్రీటు, ఇనుప చువ్వల పరిస్థితి ని పరిశీలించింది. అనంతరం రాజధాని రోడ్లు, వాటికి అనుసంధానమై నిర్మాణంలో ఉన్న బ్రిడ్జీలను కూడా పరిశీలించింది. ఈ బృందం వెంట జియో టెక్నికల్ ఎక్స్‌పర్ట్, సీఆర్‌డీఏ చీఫ్ ఇంజనీర్లు ధనుంజయ, శివప్రసాద్, గతంలో ఐకానిక్ భవనాల ఫౌండేషన్ పనులు చూసిన ఇంజనీర్ హేమంబర్‌రెడ్డి, ఎన్‌సీసీ, ఎల్ అండ్‌టీ, షపూర్జీ పల్లోంజీ కంపెనీల ఇంజనీర్లు, వారి ప్రతినిధులు ఉన్నారు.

ఆంధ్ర యూనివర్సిటీలో
డిస్టెన్స్, ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లు



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(ఏయూ-సీడీఓఈ) ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(ఎస్‌డీఈ)- ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్, ఆన్‌లైన్ మోడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు: బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. బీఎస్సీ ప్రోగ్రామ్‌ను ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. మిగిలినవాటిని ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో చదువుకోవచ్చు.

- **బీఎస్సీ గ్రూప్ సబ్జెక్టులు:** మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, బోటనీ, జువాలజీ
- **అర్హత:** బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూప్‌తో ఇంటర్/రెండేళ్ల ఐటీఐ/పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులు; వెటర్నరీ/అగ్రికల్చర్ డిప్లొమా పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏపీఓఎస్/ఎన్ఐఓఎస్ అభ్యర్థులు కూడా అర్హులే. బీఎస్సీ(ఎంపీసీ/ఎంపీసీఎస్/ఎంస్టాట్‌సీఎస్) కోర్సులకు పాలిటెక్నిక్ డిప్లొమా/ఇంటర్(ఎంపీసీ)ఉత్తీర్ణులు; మేథమెటిక్స్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసిన ఒకేషనల్ అభ్యర్థులు అర్హులు. బీఎస్సీ(సీబీజడ్) కోర్సుకు ఇంటర్(బైపీసీ)/డిప్లొమా(వెటర్నరీ/అగ్రికల్చర్) ఉత్తీర్ణులు; సైన్స్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసిన ఒకేషనల్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు: ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** తెలుగు, ఇంగ్లీష్, ఎకనామిక్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హిస్టరీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, మేథమెటిక్స్
- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు:** సైకాలజీ, మేథమెటిక్స్, బోటనీ, ఫిజిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, జువాలజీ
- **ఎంబీఏ స్పెషలైజేషన్‌లు:** హెచ్‌ఆర్‌ఎం, ఫైనాన్స్, మార్కెటింగ్
- **అర్హత:** ఎంసీఏలో ప్రవేశానికి బీటెక్(సీఎస్ఈ)/బీసీఏ ఉత్తీర్ణులు; ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి బీఎస్సీ/బీకాం/బీఏ పూర్తిచేసినవారు; బీఏ/బీకాం ఉత్తీర్ణతతోపాటు ఏయూ నుంచి పీజీడీసీపీఏ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మిగిలిన ప్రోగ్రామ్‌లకు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. (ఎంఏ/ఎమ్మెస్సీ)(మేథమెటిక్స్), ఎమ్మెస్సీ(బోటనీ/ఫిజిక్స్/ఆర్గానిక్ కెమిస్ట్రీ/జువాలజీ), ఎంఏ(హిందీ) ప్రోగ్రామ్‌లకు మాత్రం డిగ్రీ స్థాయిలో సంబంధిత స్పెషలైజేషన్ సబ్జెక్ట్ చదివి ఉండాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.andhrauniversity-sde.com

జేఎన్‌టీయూకేలో స్పాన్సర్డ్ ఎంటెక్

కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)- స్పాన్సర్డ్ కేటగిరీ కింద ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. కాకినాడ, నర్సరావుపేట క్యాంపస్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. అకడమిక్ మెరిట్, గేట్ 2024/జీప్యాట్ 2024/పీజీఈసెట్ 2024 ర్యాంక్, అనుభవం, కౌన్సెలింగ్‌ల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. స్పెషలైజేషన్‌కు అయిదు సీట్లు చొప్పున మొత్తం 125 సీట్లు ఉన్నాయి. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు స్కాలర్‌షిప్‌లు, స్టయిపెండ్ లభించవు.

ఎంటెక్ విభాగాలు-స్పెషలైజేషన్‌లు: సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్, బయోటెక్నాలజీ, నానోటెక్నాలజీ, రిమోట్ సెన్సింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఏవియానిక్స్, ఎన్విరాన్‌మెంటల్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ.

అర్హత: ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి సంబంధిత ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్/ఏఎంఐఈ పూర్తిచేసి ఉండాలి. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ప్రకారం ఎంసీఏ లేదా ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్/స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/జియో ఫిజిక్స్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్/కంప్యూటర్ అప్లికేషన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్/కెమిస్ట్రీ/బయో కెమిస్ట్రీ/మైక్రోబయాలజీ/బయోటెక్నాలజీ/లైఫ్ సైన్సెస్/ఎర్త్ సైన్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్/డెయిరీ టెక్నాలజీ) ఉత్తీర్ణులు; ఎంబీబీఎస్/బీడీఎస్/బీ ఫార్మసీ/బీవీఎస్సీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ/పీజీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. గేట్ 2024/జీప్యాట్ 2024/పీజీఈసెట్ 2024 అర్హత తప్పనిసరి. అభ్యర్థులకు కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. స్పాన్సర్‌షిప్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **సెమిస్టర్ ఫీజు:** రూ.25,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 23
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

దిక్సూచి DIKSUCHI

బయోటెక్నాలజీ, సైన్సెస్ విభాగాల్లో పీజీ చేయాలనుకొనే వారి కోసం ఉద్దేశించిన 'జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్(జామ్) 2025' షెడ్యూల్ వెలువడింది. దీనిని ఈ ఏడాది ఐఐటీ ఢిల్లీ నిర్వహిస్తోంది. ఈ పరీక్షలో సాధించిన స్కోర్ ద్వారా ఎమ్మెస్సీ; ఎమ్మెస్సీ(టెక్); ఎంఎస్(రీసెర్చ్); జాయింట్/డ్యూయల్ డిగ్రీ ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ; ఎమ్మెస్సీ-ఎంటెక్ డ్యూయెల్ డిగ్రీ; ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న 21 ఐఐటీలు అందిస్తున్న వివిధ పీజీ ప్రోగ్రామ్‌లలో సుమారు 3000 సీట్లను జామ్ స్కోర్ ద్వారా నేరుగా భర్తీ చేస్తారు. అలాగే నిట్ సంస్థలు, ఐసర్లు, ఐఐఎస్సీ, ఐఐఈఎస్‌టీ, డీఐఏటీ, ఐఐపీఈ, జేఎన్‌సీఏఎస్ఆర్, ఎస్ఎల్ఐఈటీ సహా ప్రముఖ సీఎఫ్‌టీఐ సంస్థల్లో 2300కు పైగా ఉన్న సీట్ల భర్తీకి కూడా ఈ స్కోరునే ప్రామాణికంగా తీసుకుంటారు.

సైన్స్ పీజీల్లో ప్రవేశానికి జామ్

జామ్ పేపర్లు: జామ్ ఎగ్జామ్‌ను ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో నిర్వహిస్తారు. ఉదయం సెషన్‌లో కెమిస్ట్రీ, జియాలజీ, మేథమెటిక్స్ పేపర్లు; మధ్యాహ్నం సెషన్‌లో బయోటెక్నాలజీ, ఎకనామిక్స్, మేథమెటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్ పేపర్లు ఉంటాయి. అభ్యర్థులు గరిష్ఠంగా రెండు పేపర్లు రాయవచ్చు. రెండు పేపర్లు రాసేవారు ఉదయం సెషన్ నుంచి ఒక పేపర్, మధ్యాహ్నం సెషన్ నుంచి మరో పేపర్ ఉండేలా చూసుకోవాలి. పేపర్లకు నిర్దేశించిన సిలబస్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. కెమిస్ట్రీ పేపర్ సిలబస్ మారినందున దానిని త్వరలోనే అప్‌లోడ్ చేస్తారు.

అర్హత: అభ్యర్థి జామ్‌లో ఎంచుకొన్న పేపర్/పేపర్లను అనుసరించి సంబంధిత సబ్జెక్టులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు; సంబంధిత ఇండియన్ డిగ్రీ పూర్తిచేసిన విదేశీ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు. ఒక అభ్యర్థి ఎన్నిసార్లయినా జామ్ ఎగ్జామ్ రాయవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** సెప్టెంబరు 3
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 11
- **అడ్మిట్ కార్డుల డౌన్‌లోడింగ్:** 2025 జనవరిలో
- **జామ్ 2025 ఎగ్జామ్ తేదీ:** 2025 ఫిబ్రవరి 2
- **వెబ్‌సైట్:** jam2025.iitd.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/gudU4Skలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



యుద్ధానికి సిద్ధం

అడివిశేష్ హీరోగా నటించిన 'గూఢచారి' సినిమాకి కొనసాగింపుగా వస్తోన్న చిత్రం 'గూఢచారి 2'. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్, అనిల్ సుంకర నిర్మిస్తున్నారు. 'గూఢచారి' చిత్రం విడుదలై ఆరేళ్లు అవుతున్న సందర్భంగా పార్ట్ 2 నుంచి ఆరు స్టైలిష్ యాక్షన్ స్టిల్స్‌ను శనివారం యూనిట్ విడుదల చేసింది. 'గూఢచారి 2' భారీ స్థాయిలో అంతర్జాతీయ ప్రమాణాలతో తెరకెక్కుతోంది' అని శేష్ చెప్పారు. ఇప్పటికి 40 శాతం షూటింగ్ పూర్తయిందని నిర్మాతలు తెలిపారు.



లావణ్యే డ్రగ్స్ అలవాటు చేసింది

● రాజ్‌తరుణ్ మాజీ ప్రియురాలిపై కేసు

రాజ్‌తరుణ్, ఆయన మాజీ ప్రియురాలు లావణ్య మధ్య నడుస్తున్న వివాదం కొత్త మలుపు తీసుకుంది.



లావణ్య తనకు డ్రగ్స్ అలవాటు చేసిందంటూ ప్రీతీ అనే యువతి నార్సింగి పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. 'లావణ్య ఇప్పటికే చాలామంది అమ్మాయిలకు డ్రగ్స్ అలవాటు చేసింది, తరచూ నాకు ఫోన్‌చేసి బెదిరిస్తోంది, ఆమెవల్ల ఇప్పటికే చాలా జీవితాలు నాశనం అయ్యాయి' అని ప్రీతి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై సుఖేందర్‌రెడ్డి తెలిపారు. డ్రగ్స్ విషయంలో అడ్డు చెప్పడం వల్లే ఆమె రాజ్‌తరుణ్‌పై కక్ష పెంచుకుందని ఆయన తరఫు లాయర్ మధుశర్మ చెప్పారు.

వయనాడ్ విలయం... సినీతారల సాయం



కేరళ సీఎం సహాయక నిధికి రూ. 25 లక్షల సాయం అందించిన మలయాళ నటుడు మోహన్‌లాల్ సహాయక చర్యల్లో సైతం పాల్గొని తన గొప్ప మనసు చాటుకున్నారు. టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్‌గా కొనసాగుతున్న ఆయన ఆ హోదాలో దగ్గరుండి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. వయనాడ్‌లోని ఆర్మీ బేస్ క్యాంప్‌లో ఆయన సైనికులను కలిశారు. తాత్కాలిక బ్రిడ్జిల నిర్మాణం లాంటి కార్యక్రమాల్లో సైనికులతో కలసి పాల్గొన్నారు. 'మీరు రీల్ హీరో కాదు రియల్ హీరో' అంటూ నెటిజన్లు మోహన్‌లాల్‌ను ప్రశంసిస్తున్నారు.



నటీనటుల విరాళాలు

భారీ వరదలు, కొండ చరియలు విరిగిపడి తీవ్రంగా నష్టపోయిన వయనాడ్ ప్రాంతంలో సహాయ, పునరావాస కార్యక్రమాలకు తమవంతు సాయం అందించేందుకు తారాలోకం నడుంకట్టింది. పలువురు నటీనటులు ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు ఇస్తున్నారు. టాలీవుడ్ కథానాయిక రష్మిక మందన్న రూ. 10 లక్షలు, నిర్మాత సూర్యదేవర నాగవంశీ రూ. 5 లక్షలు విరాళంగా ఇచ్చారు. తమిళ నటులు సూర్య, కార్తి, జ్యోతిక కలిసి రూ. 50 లక్షలు ఇవ్వగా, కమల్‌హాసన్ రూ. 25 లక్షలు, విక్రమ్ రూ. 20 లక్షలు ఇచ్చారు. దుల్కర్ సల్మాన్ రూ. 10 లక్షలు, మమ్ముట్టి రూ. 15 లక్షలు, ఫహద్‌ఫాజిల్, నజ్రియా దంపతులు రూ. 25 లక్షలు విరాళంగా అందించారు.

సక్సెస్



థియేటర్లు పెరుగుతున్నాయి

రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా జంటగా రూపొందిన 'తిరగబడరా సామీ' చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విజయోత్సవంలో నిర్మాత మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ 'మొత్తం 200 థియేటర్లలో విడుదల చేశాం. ఈ రోజు మరో 20 థియేటర్లు పెరిగాయి. మా సినిమాకు మంచి రిపోర్ట్ వచ్చింది. దర్శకుడు రవికుమార్ చౌదరి అద్భుతంగా తీశారు. లేడీ విలన్‌గా మన్నారా చోప్రా చక్కగా నటించింది' అన్నారు. మంచి సినిమాను ఏదీ అడ్డుకోలేదని ప్రేక్షకులు నిరూపించారని దర్శకుడు రవికుమార్ చౌదరి చెప్పారు.

ప్రేక్షక దేవుళ్లు కరుణించారు



'ఒక కొత్త హీరో నటించిన సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు. 'ప్రేక్షక దేవుళ్లు' అని ఎందుకు అంటారో నాకు ఇప్పుడు అర్థమైంది' అన్నారు 'అలనాటి రామచంద్రుడు' చిత్ర హీరో కృష్ణవంశీ. శుక్రవారం విడుదలైన ఈ చిత్రానికి మంచి ఆదరణ లభించిందని శనివారం నిర్వహించిన థాంక్స్ మీట్‌లో వెల్లడించారు. ఈ చిత్ర నిర్మాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్మాత శ్రీరామ్ జడపోలు కృతజ్ఞతలు తెలిపారు.



రెస్పాన్స్ బాగుంది

'చాలా రోజుల తర్వాత ఒక క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను చూశామని ప్రేక్షకులు అంటుంటే ఆనందంగా ఉంది' అన్నారు దర్శకుడు విజయ్‌భాస్కర్. శ్రీ కమల్, తాన్వీ ఆకాంక్ష జంటగా రూపొందిన 'ఉషా పరిణయం' చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ నేపథ్యంలో శనివారం ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో చిత్రనిర్మాత, దర్శకుడు విజయభాస్కర్ మాట్లాడుతూ 'కలెక్షన్లు నెమ్మదిగా పెరుగుతున్నాయి. రెస్పాన్స్ బాగుంది. ఇలాంటి చిన్న సినిమాలను ఆదరిస్తే మరిన్ని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లు వస్తాయి' అన్నారు



జంపని గ్రామ పంచాయతీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో నరసింహారావు

నిధుల వినియోగంపై ఫిర్యాదు

● విచారణ నిమిత్తం రికార్డులు స్వాధీనం చేసుకున్న డీఎల్‌పీవో

వేమూరు, ఆగస్టు 3: మండలంలోని జంపని గ్రామ పంచాయతీ నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయంటూ వార్డుల సభ్యులు డీఎల్‌పీవోకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎల్‌పీవో నరసింహారావు శనివారం ప్రత్యేక టీం ద్వారా విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫిర్యాదుచేసిన వార్డు సభ్యులు డీఎల్‌పీవోను కలసి 2020-21నుండి 2023-24వరకు సర్పంచ్ ఫోర్జరీ సంతకాలతో నిధులు దుర్వినియోగం అయ్యాయని పేర్కొన్నారు. జమా ఖర్చుల విషయంలో సమావేశ తీర్మానాలు లేకుండా వ్యవహరించారని, చేపట్టిన పనులు, స్టేట్‌మెంట్లు కూడా తారుమారు చేశారని వివరించారు. గతంలో నిర్వహించిన సమావేశాల తీర్మానాలు చేసిన పనుల వివరాలు తెలియకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించిన డీఎల్‌పీవో సంతృప్తిని వ్యక్తపరిచారు. డీపీవోకు నివేదిక సమర్పించే నిమిత్తంగా మరికొన్ని రికార్డులను పరిశీలించేందుకు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గతంలో పనిచేసిన కార్యదర్శి, గుమాస్తాల ద్వారా కొంత సమాచారాన్ని రికార్డు చేశారు.

ఫిర్యాదులపై విచారణలు....

వేమూరు నియోజకవర్గంలోని కొన్ని పంచాయతీలలో నిధులు దుర్వినియోగంపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై విచారణలు ప్రారంభించినట్లు డీఎల్‌పీవో విలేకర్లకు వివరించారు. భట్టిప్రోలు మండలం పల్లెకోన గ్రామ పంచాయతీలో ఇంటి పన్నుల బిల్లులను తారుమారు చేశారని, సుమారు రూ.6లక్షల వరకు దుర్వినియోగం అయినట్టు విచారణలో గుర్తించామన్నారు. ఇంటింటికి మంచినీటి కుళాయిల కనెక్షన్ల విషయంలో సర్పంచ్ కార్యదర్శితో సంబంధం లేకుండా ఒక్కొక్క ఇంటినుండి రూ.5వేల చొప్పున 100మంది దగ్గర డబ్బులు వసూలు చేశారని, వాటిని పంచాయతీ ఖాతాలోకి జమ చేయలేదన్నారు. అలాగే మోదకూరు, జంపని పంచాయతీలలో కూడా నిధులు వినియోగంపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. జూలై 25నుండి ఈనెల 15వరకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాలలో పారిశుధ్య చర్యల నిమిత్తం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు.

అమరావతి రైతుల వార్షిక కౌలు , పేదల పింఛన్ల కాలపరిమితి పెంపు శుభపరిణామం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 3: అమరావతి రైతులకు, పేదల పింఛన్ల కాలపరిమితిని, వార్షిక కౌలు మరో ఐదేళ్లు పెంచడం శుభపరిణామం అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతులను సీఎం చంద్రబాబునాయుడు ఎప్పుడూ గుర్తుంచుకుంటారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అమరావతి రైతులు ప్రతిరోజు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. చంద్రబాబు నిర్ణయంతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని, రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అమరావతి నిర్మాణానికి కేంద్రప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుందని చెప్పారు.

సీఎం చంద్రబాబుతో ఎస్‌ఆర్‌ఎం కులపతి భేటీ

● వర్సిటీ అభివృద్ధి, విస్తరణ ప్రాజెక్టులపై చర్చ

మంగళగిరి సిటీ, ఆగస్టు 3: ఎస్‌ఆర్‌ఎం విశ్వవిద్యాలయం వ్యవస్థాపక కులపతి, మాజీ పార్లమెంటు సభ్యుడు డాక్టర్ టీఆర్ పారివేందర్, వర్సిటీ అధ్యక్షుడు డాక్టర్ పీ సత్యనారాయణన్‌లు శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. సచివాలయంలోని సీఎం కార్యాలయంలో చంద్రబాబును కలిసి వర్సిటీ అభివృద్ధి, నూతన విస్తరణ ప్రాజెక్టుల గురించి ముఖ్యమంత్రికి వివరించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, స్కిల్లింగ్ అకాడమీల ప్రాముఖ్యతలను సీఎంకు వివరించారు. ఇందుకోసం యూనివర్సిటీ చేపట్టనున్న నూతన ప్రాజెక్టులకు ప్రభుత్వపరమైన సహకారం అందించాలని కోరారు. ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ ఏర్పాటు సమయంలో జరిగిన ఒప్పందం మేరకు వర్సిటీకి మరో వంద ఎకరాలను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆయా విజ్ఞప్తులపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని, వర్సిటీకి అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారని ఎస్‌ఆర్‌ఎం ప్రతినిధులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య మనోజ్ కుమార్ అరోరా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆచార్య డి.నారాయణరావు, ఉపాధ్యక్షుడు జానకీరామన్, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబును కలిసిన డాక్టర్ పారివేందర్, సత్యనారాయణన్, వీసీ మనోజ్, ఈడీ నారాయణరావు తదితరులు

సీవో 2లో మార్పుల వల్లే గ్లోబల్ వార్మింగ్

● అస్సాం అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎల్లా రత్తయ్య

పెదకాకాని, ఆగస్టు 3: గ్లోబల్ వార్మింగ్ అనేది సీవో 2లో మార్పులు పెరగడం వలన వస్తుందని అస్సాం అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎల్లా రత్తయ్య తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని బోటనీ, మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో ట్రీస్ గ్లోబల్ వార్మింగ్ అండ్ క్లైమేట్ చేంజ్ అనే అంశంపై శనివారం లెక్చర్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ కె.గంగాధర్‌రావు అధ్యక్షత వహించారు. ప్రొఫెసర్ ఎల్లా రత్తయ్య ముఖ్యవక్తగా మాట్లాడుతూ ప్రస్తుతం కార్బన్ ఫుట్ ప్రింట్స్ వల్ల కార్బన్ డయాక్సైడ్ తగ్గించవచ్చన్నారు. అమెరికా అధికంగా గ్లోబల్ వార్మింగ్‌కి కారణం అవుతోందన్నారు. పొల్యూషన్ రహిత దేశంగా భూటాన్ ఉన్నదని, ఇందులో 70 శాతం అటవీప్రాంతం ఉంటుందన్నారు. సీవో2 విడుదల కంటే గ్రహింపు ఎక్కువగా ఉంటుందని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నెట్ జీరో లేదా సీవో2 పొల్యూషన్ రహిత దేశంగా 2070కి భారతదేశాన్ని నిలిపేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారని పేర్కొన్నారు. వీసీ గంగాధరరావు మాట్లాడుతూ మారుతున్న గ్లోబల్ క్లైమేట్ కండిషన్ వల్ల విపరీత మార్పులు వస్తున్నాయని దీనిని తట్టుకోవడానికి మొక్కల మీద సరైన అవగాహన కల్పించడానికి ప్రకృతిలోని జంతువులు, మొక్కలతో సమిష్టిగా ఉండి వాటి సంరక్షణ, పోషణపై బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. వీరయ్య, పర్యావరణ సంరక్షణలో మొక్కల పాత్రపై, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగాధిపతి బ్రహ్మాజీరావు గ్లోబల్ వార్మింగ్ అండ్ క్లైమేట్ చేంజ్, జాతీయ, అంతర్జాతీయ రెగ్యులేషన్స్ గురించి వివరించారు. సదస్సు ఆవశ్యకతను హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ మల్లికార్జున వివరించారు. ఎంసీఏ విభాగానికి చెందిన డాక్టర్ నీలిమ సదస్సును నిర్వహించగా బోటనీ, మైక్రోబయాలజీ విభాగానికి చెందిన అధ్యాపకులు ప్రొఫెసర్ వి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ ఏ అమృతవల్లి, డాక్టర్ జె.మాధవి, వైఆర్‌కేవీ తిరుపతిరావు, పరిశోధక విద్యార్థులు, పర్యావరణ శాస్త్ర విభాగం, బయోటెక్నాలజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ ఎల్లా రత్తయ్యను సత్కరిస్తున్న వీసీ ఆచార్య గంగాధరరావు

యూజీసీ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రాజ్‌కపూర్‌ను కలిసిన వీసీ గంగాధరరావు

పెదకాకాని, ఆగస్టు 3: న్యూఢిల్లీలోని యూనివర్సిటీ గ్రాండ్స్ కమిషన్ (యూజీసీ) జాయింట్ సెక్రెటరీ డాక్టర్ అవిచల్ రాజ్‌కపూర్‌ను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలో ఓ అకడమిక్ వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం వివరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (డీఈబీ) ఇచ్చిన అనుమతితో కోర్సులు నడుస్తున్నాయని ప్రస్తుతం ఆర్ట్స్ విభాగంలో కోర్సులు మాత్రమే ఉన్నాయని సైన్స్ కోర్సులకు దరఖాస్తులు చేసుకున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సైన్స్ కోర్సుల ద్వారా ఎక్కువమంది విద్యార్థులు విద్యనభ్యసించే అవకాశం ఉంటుందని ఆయనకు తెలియజేశారు. దూరవిద్య సేవలను విస్తృతం చేసే క్రమంలో సైన్స్ కోర్సులను త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. సైన్స్ కోర్సులు వస్తే విశ్వవిద్యాలయ అభివృద్ధి వేగంగా జరుగుతుందని తద్వారా మెరుగైన విద్యార్థి సేవలకు వర్సిటీ వేదికగా నిలుస్తుందని ఆయన దృష్టికి తెచ్చారు. వీసీ వినతిపై డాక్టర్ రాజ్‌కపూర్ సానుకూలంగా స్పందించారు. దూరవిద్య కేంద్రానికి సైన్స్ కోర్సులు వచ్చేందుకు తన వంతు సహకారం అందిస్తానని వీసీకి హామీ ఇచ్చారు. అలాగే వర్సిటీని సందర్శించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. అనంతరం వీసీ గంగాధరరావు, రాజ్‌కపూర్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు.



మాచవరంలో ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని, జంగా కృష్ణమూర్తి తదితరులు

రాష్ట్రాభివృద్ధికి సహకరించండి

● ఎన్డీఏ కూటమి శ్రేణులతో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

మాచవరం, ఆగస్టు 3: ప్రజలు ఎన్నో ఆశలతో, ఆకాంక్షలతో కూటమి ప్రభుత్వానికి చారిత్రక విజయాన్ని అందించారని, అందుకనుగుణంగానే కూటమి శ్రేణులు ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేపట్టబోయే కార్యకలాపాలకు సహకరించాలని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కోరారు. శనివారం మాచవరం మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్డీయే సర్వసభ్య సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తితో కలసి ఎమ్మెల్యే యరపతినేని పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ఐదేళ్ల పరిపాలన కాలంలో ప్రజలు, రాష్ట్రం అన్నివిధాలా నష్టపోయారన్నారు. మద్యపాన నిషేదం చేస్తామని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి మద్యం రేట్లు పెంచుకుంటూ పోయారన్నారు. రాష్ట్రంలో ఉద్యోగాలు ఇవ్వకుండా గంజాయి రాష్ట్రంగా తయారు చేశారన్నారు. గతంలో పెంచిన పింఛన్లను తిరిగి పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రాష్ట్రం అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ఎంతో కష్టపడుతున్నారని తెలిపారు. రాజధానిలేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను చేశారని, ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమరావతి అభివృద్ధికి 15 వేల కోట్ల రూపాయలు ఇచ్చినందుకు ప్రతిఒక్కరు కృతజ్ఞతలు తెలుపాలన్నారు. జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ.. 2024 సాధారణ ఎన్నికలలో ఎన్డీయే కూటమి గెలుపు చారిత్రలో నిలిచిపోతుందన్నారు. బడుగు బలహీనవర్గాల ప్రజల అభ్యున్నతి కోసమే నాడు ఎన్టీ రామారావు టీడీపీని స్థాపించారని, చంద్రబాబునాయుడు కూడా ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీల కోసం ఎంతో శ్రమిస్తున్నారన్నారు. గురజాల నియోజక వర్గాన్ని ఎమ్మెల్యే యరపతినేని, నేను కలిసి అభివృద్ధి పరుస్తామని తెలిపారు.

వర్సిటీని సందర్శించిన బాపట్ల అగ్రికల్చర్ విద్యార్థులు

పెదకాకాని, ఆగస్టు 3: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాన్ని శనివారం బాపట్లలోని అగ్రికల్చర్ కళాశాల డిగ్రీ విద్యార్థులు సందర్శించారు. వర్సిటీలోని వృక్షశాస్త్ర విభాగంలో అన్ని ల్యాబ్‌లు, క్లాస్‌రూమ్‌లను సందర్శించారు. విభాగంలోని ఆచార్యులను, పరిశోధకులను విద్యార్థులు కలిశారు. విద్యార్థులకు విభాగంలో జరిగే పరిశోధన గురించి ప్రొఫెసర్ కె.మల్లికార్జున వివరించారు. అనంతరం ప్లాంట్ బయోటెక్నాలజీ లాబ్‌లోని ప్లాంట్ టిష్యూ కల్చర్ టెక్నిక్ మీద ట్రైనింగ్ పొందారు. టిష్యూ కల్చర్ ట్రైనింగ్ పొందేందుకు ప్రతి ఏడాది బాపట్ల అగ్రికల్చర్ విద్యార్థులు, క్రాప్ సైకాలజీ విభాగ విద్యార్థులు వర్సిటీకి వస్తున్నట్లు పేర్కొన్నారు.

అఖిలభారత ప్రజారవాణా సంస్థల క్రీడాపోటీలకు రాష్ట్రస్థాయి క్రీడాకారుల ఎంపికలు



విజేతలతో ఉద్యోగులు

పెదకాకాని, ఆగస్టు 3: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో అఖిలభారత ప్రజా రవాణా సంస్థల క్రీడా ప్రోటీలకు రాష్ట్రస్థాయి క్రీడాకారుల ఎంపికలు శనివారం జరిగాయి. సెప్టెంబర్‌లో జరిగే ఈ పోటీలకు ఆయా క్రీడాకారులను ఎంపిక చేశారు. నాలుగు జోన్ల నుండి 133మంది ఏపీఎస్ ఆర్టీసీ క్రీడాకారులు 13 కేటగిరీలకు 69మందిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేఎస్ బ్రహ్మానందరెడ్డి ముఖ్యఅతిథిగా ఈ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఎంపికల నిర్వహణకు యూనివర్సిటీలో అనుమతి ఇచ్చినందుకు వీసీ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు, వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్సన్, క్రీడా విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ పాల్‌కుమార్, కోచ్ కృష్ణమోహన్‌లకు ఏపీఎస్‌ఆర్టీసీ తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎంపికల్లో 100, 200, 400, 800, 1500 మీటర్ల పరుగుపందాలు, షాట్‌పుట్, జావలిన్, డిస్కత్రో, లాంగ్‌జంప్ వంటి 13 విభాగాల్లో అన్ని కేటగిరీల ఉద్యోగులు పాల్గొని వారి ప్రతిభను చూపినట్లు పేర్కొన్నారు.

● పోటీలలో పురుషుల కేటగిరీలో 100 మీటర్ల పరుగు పందెంలో కే రాంబాబు (సింహాచలం డిపో) మొదటిస్థానంలో నిలువగా ఎన్.ప్రసాదరావు (ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్) ద్వితీయస్థానం, విశాఖపట్నం డిపోకు చెందిన కేపీ కుమార్ మూడో స్థానంలో నిలిచారు. 200 మీటర్ల విభాగంలో ఓ నవీన్, ఓ సుమంత్, పి. ధనుంజయ్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

● మహిళల కేటగిరీలో 200 మీటర్ల పరుగుపందెంలో జె.ఝాన్సీ (మధురవాడ డిపో) మొదటిస్థానం, జీన్ డిపోకు చెందిన సి.విజయలక్ష్మి రెండో స్థానం, సింహాచలం డిపోకు చెందిన వి.రత్నం మూడోస్థానంలో నిలిచారు. 100 మీటర్ల విభాగంలో పి.నాగలక్ష్మి, ఆర్.సౌగంధి, పి.స్వాతి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ఆఫీసర్ స్థాయి కేటగిరీలో (50 సంవత్సరాల పైన) 400 మీటర్ల ఫాస్ట్ నడక విభాగంలో బి.సామ్రాజ్యం(హెడ్ ఆఫీస్) మొదటిస్థానం, హెడ్ ఆఫీస్ నుంచి టీ శోభమంజరి ద్వితీయ, సీహెచ్ సునీత తృతీయస్థానంలో నిలిచారు. సూపర్‌వైజర్ కేటగిరీలో (50 సంవత్సరాల లోపు) 100 మీటర్ల ఫాస్ట్ నడక విభాగంలో ఏ మంజుల(కడప డిపో) మొదటిస్థానం, మదనపల్లి 2 డిపో జె.ఆర్ గీత రెండవస్థానం, నెల్లూరు డిపోకు చెందిన ఆర్‌ఎస్సీ లక్ష్మి తృతీయస్థానంలో నిలిచారు. ఈ విభాగాలన్నిటి మూడు స్థానాల్లో గెలుపొందిన మొత్తం 63మంది క్రీడాకారులను ఎంపికచేసి విశాఖపట్నంలో సెప్టెంబర్‌లో జరిగే అఖిల భారత పోటీలకు పంపనున్నట్లు నిర్వాహకులు సుధాకర్ తెలిపారు.

సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, ఆగస్టు 3: నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం శనివారం నాటికి 565.00 అడుగులు ఉంది. ఇది 244.14 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6660 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 3374 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 27,507 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్‌ఎల్‌సీ ద్వారా 400, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 39,741 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 3,03,741 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

భట్టిప్రోలులో ఉద్రిక్తం

● బహిరంగ చర్చావేదికను అడ్డుకున్న పోలీసులు

● టీడీపీ నేత సాయిబాబా, వైసీపీ ఇన్‌చార్జి అశోక్‌బాబు గృహ నిర్బంధం

భట్టిప్రోలు(కొల్లూరు), ఆగస్టు 3: టీడీపీ, వైసీపీ నేతల మధ్య బహిరంగ చర్చావేదిక కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. ఈ క్రమంలో భట్టిప్రోలులో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఇటీవల వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, భట్టిప్రోలు మండలంలోని టీడీపీ నేత సాయిబాబాపై పలు ఆరోపణలు చేశారు. దీనిపై స్పందించిన సాయిబాబా.. తనపై చేసిన ఆరోపణలు నిరూపిస్తే బహిరంగంగా ఉరి వేసుకుంటానని, ఆగస్టు 3వ తేదీన భట్టిప్రోలు రథం సెంటర్‌లో బహిరంగ చర్చకు సిద్ధమై సాక్ష్యాలతో నిరూపించాలని సవాల్ విసిరారు. దీనిపై స్పందించిన వైసీపీ ఇన్‌చార్జి కూడా చర్చకు తాను సిద్ధమేనని ప్రతి సవాల్ విసిరారు. ఇరువురు బహిరంగచర్చకు సిద్ధమవుతున్న తరుణంలో రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ రంగంలోకి దిగి అశోక్‌బాబును చెరుకుపల్లిలో, సాయిబాబాను భట్టిప్రోలులో గృహ నిర్బంధం చేశారు. చెరుకుపల్లి, భట్టిప్రోలులో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. మధ్యాహ్నం 3 గంటలకు టీడీపీ నేత తన కార్యాలయానికి వెళ్లేందుకు ఇంటినుంచి బయటకు రాగా పోలీసులు మళ్లీ అడ్డుకోవడంతో సాయిబాబా, టీడీపీ కార్యకర్తలు పోలీసుల మధ్య తోపులాట జరిగింది.

అధికార పార్టీ నాయకులపై పోలీసుల జులుం : టీడీపీ నేత సాయిబాబా

వైసీపీ అధికారం పోయినప్పటికీ అదే పార్టీకి పోలీసులు కొమ్ము కాస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3వరకు 8 గంటల పాటు తనను పోలీసులు గృహ నిర్బంధం చేశారన్నారు. ఇప్పటివరకు వారికి సహకరించిన తాను తన కార్యాలయానికి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్నారని, అధికార పార్టీ నాయకులం అయినప్పటికీ పోలీసులు తమపైనే జులుం ప్రదర్శిస్తున్నారంటూ ఆరోపించారు. ఇప్పటికీ పోలీసులు ప్రతిపక్ష పార్టీకే కొమ్ము కాస్తున్నారని, గత ప్రభుత్వంలోనూ టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు జరిగినా పట్టించుకోని పోలీసులు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఈ రకంగా మాపైనే జులుం ప్రదర్శించడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం, పార్టీ అధిష్ఠానం స్పందించాలని కోరారు.



టీడీపీ నేత సాయిబాబా, పోలీసుల మధ్య తోపులాట

దాడి చేసినట్లు వైసీపీ దుష్ప్రచారం

బాపట్ల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణలపై భట్టిప్రోలుకు చెందిన టీడీపీ, వైసీపీ నేతలు చేసుకున్న పరస్పర సవాళ్ల దృష్ట్యా ముందస్తు చర్యలలో భాగంగా ఇరుపార్టీల నేతలను శనివారం గృహనిర్బంధం చేసినట్లు పోలీసులు తెలిపారు. టీడీపీ నేత తూనుగుంట సాయిబాబు తన ఇంటినుంచి భట్టిప్రోలులోని రథంసెంటర్‌కు రావడానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో టీడీపీ కార్యకర్త తాండవకృష్ణ, సాయిబాబును విడిపించే ప్రయత్నంచేయగా అతడి చేయి తగిలిందే కానీ అది దాడికాదని పోలీసులు తెలిపారు. అయితే ఈ ఘటనపై వైసీపీశ్రేణులు దుష్ప్రచారం చేస్తున్నట్లు పోలీస్‌శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

రైలింజన్ పైకి ఎక్కిన బాలుడు.. తృటిలో తప్పిన ప్రమాదం

బాపట్ల, ఆగస్టు 3: బాపట్ల రైల్వేస్టేషన్‌లో మతిస్థిమితం లేని బాలుడు రైలింజన్ పైకి ఎక్కాడు. స్టేషన్ సిబ్బంది ఆర్‌పీఎఫ్ వారు అప్రమత్తం కావటంతో తృటిలో ప్రమాదం తప్పింది. స్టేషన్ మాస్టర్ మీనా తెలిపిన వివరాల ప్రకారం కలకత్తాకు చెందిన 15 సంవత్సరాల వయసు గల శశాంత్ సికారి శనివారం ఉదయం ఏదో ట్రైన్‌లో బాపట్ల రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. మతిస్థిమితం సరిగ్గాలేని ఆ బాలుడు సింహపురి రైలింజన్ పైకి ఎక్కాడు. చుట్టుపక్కల ప్రయాణికులు కేకలు పెట్టటంతో రైలుడ్రైవర్ గమనించి స్టేషన్ సిబ్బందికి సమాచారం అందించాడు. వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఆర్‌పీఎఫ్ ఎస్సై శ్రీనివాసరావు, స్టేషన్ సిబ్బంది కలిసి ఆ బాలుడిని ఇంజన్‌పైనుంచి కిందకు దించారు. ఈ సంఘటనతో స్టేషన్‌లో రైలు సుమారు 20 నిమిషాలుపాటు నిలిచిపోయింది. బాలుడి దగ్గర ఉన్న ఆధార్ కార్డు ప్రకారం వివరాలు సేకరిస్తున్నారు. బాలుడు ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఆధీనంలో ఉన్నాడు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు అవసరమైతే బాలసదన్‌కు పంపిస్తామని తెలిపారు.



ఇంజన్‌పై నుంచి బాలుడిని కిందకు దించుతున్న ఆర్‌పిఎఫ్ సిబ్బంది

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	101, 109,120
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00

పల్నాడు వార్తలు



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి పీ ప్రియదర్శిని

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

● చట్టవ్యతిరేక కార్యకలపాలతో భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు

● ఒకటవ అదనపు సివిల్ న్యాయాధికారి పీ.ప్రియదర్శిని

సత్తెనపల్లి, ఆగస్టు 3 : మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని సత్తెనపల్లి ఒకటవ అదనపు సివిల్ న్యాయాధికారి పీ.ప్రియదర్శిని అన్నారు. మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని శ్రీ బాబా గురుదేవ్ కళాశాలలో 'మాదక ద్రవ్యాల వినియోగం.. దుష్ప్రభావాల'పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి ప్రియదర్శిని మాట్లాడుతూ మాదకద్రవ్యాల తయారీ, అమ్మకం, రవాణా వంటి చర్యలు చట్ట వ్యతిరేకమని, విద్యార్థులు వీటి జోలికి వెళ్ల కూడదన్నారు. కాదని ఆ వైపు వెళ్లితే వారి భవిష్యత్తు నాశనం అవుతుందని హెచ్చరించారు. పట్టణ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఎవరైనా గంజాయి విక్రయించినా, సేవించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రగ్స్ సరఫరా, అమ్మకం గురించి విద్యార్థులకు సమాచారం తెలిస్తే తమకు తెలియ జేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సంధ్యారాణి, న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావు, పీఎల్ కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ దార్ల మాధవి, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి శ్రీనివాస్ కల్యాణ్

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

● న్యాయ అవగాహన సదస్సులో న్యాయాధికారి శ్రీనివాస్ కల్యాణ్

మాచర్లరూరల్, ఆగస్టు 3: విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని న్యాయాధికారి శ్రీనివాస్ కల్యాణ్ తెలిపారు. పట్టణంలోని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి శ్రీనివాస్ కల్యాణ్ విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏజీపీ గొర్రె వెంకటేశ్వర్లు (జీవీ), న్యాయవాదులు వై కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ జె లక్ష్మీకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంద రోజుల ప్రత్యేక కార్యక్రమం

క్రోసూరు, ఆగస్టు 3: చట్టాలపై అవగాహనతో పాటు తమను తాము రక్షించుకొనే విధానం గురించి బాలికలు, మహిళలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని, ఇందుకోసం వంద రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు ఐసీడీఎస్ సూపర్ వైజర్ వీ.మాధవి తెలిపారు. శనివారం మండల పరిధిలోని తొమ్మిది అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. బిడ్డకు పుట్టిన గంట లోపే ముర్రు పాలు తాగిస్తే బిడ్డ ఆరోగ్య వంతంగా ఎదటంతోపాటు మానసికంగా వికాసవంతులవుతారని తెలిపారు. మొదటి ఆరు నెలలు తప్పనిసరిగా బిడ్డకు తల్లిపాలు తాగించాలని, దీంతో మహిళలు బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని వివరించారు. అనంతరం తల్లిపాల వారోత్సవర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శివపార్వతి, మెరీనా, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ శ్రీరామమూర్తి పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

డాక్టర్ శ్రీరామమూర్తి మృతి బాధాకరం

● గురజాల ఎమ్మెల్యే యరపతినేని


గురజాలటౌన్, ఆగస్టు 3: డాక్టర్ చల్లగుండ్ల శ్రీరామమూర్తి మృతి ఎంతో బాధాకరమని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శనివారం గురజాల పట్టణానికి చేరుకున్న ఆయన డాక్టర్ శ్రీరామమూర్తి పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ 40 ఏళ్లపాటు పల్నాడు ప్రాంతంలో వైద్య సేవలందించిన డాక్టర్ శ్రీరామమూర్తి ఎంతో మంచి పేరు సంపాదించారన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్రకుమార్, మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఉన్నం మల్లికార్జునరావులు డాక్టర్ శ్రీరామమూర్తి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ శ్రీరామమూర్తి అంతిమయాత్ర నిర్వహించారు.

ఎస్ఎంసీ ఎన్నికల షెడ్యూల్

రెంటచింతల,ఆగస్టు 3: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటి ఎన్నికలకు సంబంధించి ఈనెల 5న ఉదయం నుంచి ఓటరు జాబితాలపై అభ్యంతరాలను స్వీకరిస్తారని సత్తెనపల్లి డీవై ఈవో ఏసుబాబు, ఎంఈవో 2 శివ నాగేశ్వరరావులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 8వ తేదీ ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్యలో సభ్యులను, 1-30 గంటలకు చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ ఎన్నుకోవాలని తెలిపారు. 2 గంటలకు ఎన్నికైన వారితో ప్రమాణ స్వీకారం చేయించి 3-30 గంటలలోపు తొలి సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. మండలంలో 38 పాఠశాలలకు ఎన్నికల జరగనుండగా సత్తెనపల్లి డిప్యూటి పరిధిలోని 14 మండలాల్లో 85 ఉన్నత పాఠశాలలకు ఎన్నికలు జరుగుతాయని వారు పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట

మాచర్లటౌన్, ఆగస్టు 3: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు దుర్గారావు అన్నారు. శనివారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో డ్వాక్రా సంఘాలు, ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమాల్లో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి బండ్ల శ్రీనివాసరావు, తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం మాచర్ల డివిజన్ ప్రెసిడెంట్ షేక్ జానీబాషా, జక్కా నరసింహారావు, మున్సిపల్ సిబ్బంది సుబ్బారావు, రాజశేఖర్, అంజలి తదితరులు పాల్గొన్నారు.



దాచేపల్లిలోని పొలంలో పురుగుమందు పిచికారి చేస్తున్న ఎలక్ట్రికల్ రోబో ట్రాక్టర్

ఎలక్ట్రికల్ రోబో ట్రాక్టరుతో వ్యవసాయ పనులు

దాచేపల్లి, ఆగస్టు 3: దాచేపల్లి గ్రామంలో ఉప్పుతోళ్ల శ్రీనివాసరావు అనే రైతు శనివారం తన పొలంలో ఓ ఎలక్ట్రిక్ రోబో ట్రాక్టరుతో పొలం దున్నించడం, పిచికారి చేయించడం, కలుపు మొక్కలను తొలగించడం వంటి వ్యవసాయ పనులను చేయించాడు. హైదరాబాద్‌కు చెందిన ఫామ్స్ సాపి ఆధ్వర్యంలో నడికూడికి చెందిన అంబుజా ఫౌండేషన్ సహకారంతో ఈ ఎలక్ట్రికల్ రోబో ట్రాక్టరు ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా ఫామ్స్ సాపి సీఈవో ప్రశాంత్, శ్రావణ్‌లు మాట్లాడుతూ ఈ రోబో కాలుష్య రహితమైనదని, ఒక్కసారి చార్జింగ్ చేస్తే 2 నుండి 6 ఎకరాల పొలం వరకు పురుగు మందులు పిచికారి చేయడం, 2 ఎకరాలలో దున్నడం, కలుపు మొక్కలను తొలగించడం వంటివి చేస్తుందని వివరించారు. ఒక్కసారి చార్జింగ్‌కు రూ. 50 ఖర్చు మాత్రమే అవుతుందని తెలిపారు.

ఆదర్శప్రాయమైన పాలన అందిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

● వైసీపీ చిల్లర రాజకీయాలు మనకొద్దు

● పిన్నెల్లిలో జరుగుతున్న సంఘటనలకు ఫుల్‌స్టాప్ పెట్టండి

● ఎన్డీఏ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే యరపతినేని

● హాజరైన మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

మాచవరం, ఆగస్టు 3: ప్రజలు ఎన్నో ఆశలతో కూటమి ప్రభుత్వానికి కనీవినీ ఎరుగని విజయాన్ని అందించారని, అందుకు తగ్గట్టుగానే ఆదర్శప్రాయమైన పాలనను అందించి, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చుదామని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శనివారం మాచవరంలోని మునుసుబు కల్యాణ మండపంలో టీడీపీ సీనియర్ నాయకులు యడ్లపల్లి రామారావు అధ్యక్షతన ఎన్డీఏ సర్వసభ్య సమావేశం వహించారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో అనేక రకాల అక్రమాలు, అన్యాయాలు చేశారని, అందుకే ప్రజలు వారిని 151 సీట్లు నుంచి 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. పిన్నెల్లి గ్రామంలో గత ఐదేళ్లలో వైసీపీ శ్రేణులు చేసిన అక్రమాలు, దోపిడీలు, హత్యా రాజకీయాలు, అత్యాచారాలు తదితర సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. తప్పులు చేసిన వారిని ఏం చేయాలో పోలీసులు, కోర్టులు చూసుకుంటాయని, మనవాళ్లెవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని వ్యవహరించ వద్దని హెచ్చరించారు. ప్రస్తుతం ప్రజలు మన భుజస్కంధాలపై బరువు బాధ్యతలు పెట్టారని, ఈ ఐదేళ్లపాటు ప్రజల సంక్షేమం, అభ్యున్నతికి పాటుపడదామని సూచించారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రూ. 2 కోట్ల నిధులతో గ్రామాలలో లింకు రోడ్లు, సబ్‌స్టేషన్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. గోవిందాపురం లిఫ్ట్‌ఇరిగేషన్‌ను కొత్తపాలెం, పిల్లుట్ల గ్రామాల వరకు పొడిగిస్తామన్నారు. గత వైసీపీ పాలనలో అవమానాలు పొందిన మన కార్యకర్తలకు, నాయకులకు పోలీస్ స్టేషన్, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో గౌరవం లభించేలా చర్యలు చేపడతానన్నారు. పార్టీ కోసం పనిచేసిన వారికి గౌరవప్రదమైన గుర్తింపు వచ్చేలా చూస్తానన్నారు. చెన్నాయపాలెం గ్రామంలో త్వరలో సరస్వతి సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు రాజశేఖర్ రెడ్డి, యరపతినేని రమేష్, టీడీపీ మండల అధ్యక్షుడు బడిగుంచల వెంకటేశ్వర్లు, చల్లాపల్లి నరసింహారావు, జమ్మిగుంపుల వెంకటేశ్వర్లు, కొల్లి కృష్ణమూర్తి, యామని రామారావు, చిట్టిప్రోలు నరసింహారావు, గుదె రామారావు, యారాశి వెంకటరావు, మాలపాటి మల్లయ్య, పుసులూరి రామయ్య, దున్నా చెన్నయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశానికి హాజరైన పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు

అటవీ భూముల సంరక్షణకు ప్రాధాన్యం



అటవీ భూముల గురించి అధికారులతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో

● డీఎఫ్‌వో రామచంద్రరావు

● అధికారులతో కలసి భూముల పరిశీలన

పిడుగురాళ్ల, ఆగస్టు 3: పల్నాడు ప్రాంతంలో అటవీ భూముల సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని పల్నాడు డీఎఫ్‌వో రామచంద్రరావు తెలిపారు. శనివారం ఆయన గుత్తికొండ అటవీ ప్రాంతాన్ని పరిశీలించి, అక్కడ అనధికారికంగా సాగుచేస్తున్న భూముల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గిరిజన హక్కుచట్టం ద్వారా అర్హులైనవారు మినహా మరెవరైనా భూములను అన్యాక్రాంతం చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గతంలో దోమలకుంట ప్రాంతంలో నర్సరీకి కేటాయించిన భూములను కొందరు సాగుచేసుకొని బోర్లు వేసుకోవడమే కాకుండా క్రయ విక్రయాలు సాగించారని తమ దృష్టికి వచ్చినట్లు డీఎఫ్‌వో రామచంద్రరావు తెలిపారు. ప్రతిరోజు గుత్తికొండ అటవీ ప్రాంతంలో అధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు. ఆయనవెంట నరసరావుపేట రేంజ్ డీఆర్‌వో వెంకటరమణ, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నీలిమాదేవి, బీట్ ఆఫీసర్ మనోజ్, శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేత రూ.3.27 కోట్లకు ఐపీ

కారంపూడి, ఆగస్టు 3: కారంపూడికి చెందిన బియ్యం వ్యాపారి, వైసీపీ నేత కరాలపాటి పెద సుబ్బారావు ఐపీ పెట్టారు. సుమారు రూ.3.27 కోట్ల మేర అప్పులు చేసి పరారయ్యాడని బాధితులు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. సుబ్బారావు 25 ఏళ్లుగా స్థానికంగా ఉంటూ తనకున్న పరిచయాలతో భారీగా అప్పులు చేశాడు. బస్టాండ్ వద్ద భవనాలు కట్టిస్తున్నానంటూ నమ్మబలికి డబ్బులు తీసుకొని ఊరొదిలి పరారయ్యాడు. కాగా తనకు అప్పులు ఇచ్చిన 42 మందికి గత నెల 30న ఐపీకి సంబంధించిన కోర్టు నోటీసులు పంపారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

చెంచుకాలనీలో వైద్యశిబిరం

వెల్దుర్తి, ఆగస్టు 3: మండలంలోని రచ్చమలపాడు చెంచుకాలనీలో శనివారం పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ శ్రీరామ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతుండగా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు డాక్టర్ శ్రీరామ్ తెలిపారు. మొత్తం 123 మందికి వైద్య పరీక్షలకు నిర్వహించి ఉచితంగా మందులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఏడుకొండలు, వైద్య సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృత దేహం

నకరికల్లు, ఆగస్టు 3: బెల్లంకొండ బ్రాంచ్‌కెనాల్‌లో శనివారం గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకరికల్లు గ్రామ శివారులోని శివాపురం తండా వెళ్ళే రహదారి వద్ద బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో సుమారు 50 నుంచి 55 ఏళ్ల మధ్య గల ఒక వ్యక్తి మృతదేహం కాలువలో కొట్టుకు వచ్చింది. స్థానికుల సమాచారం మేరకు నకరికల్లు వీఆర్‌వో సానా గౌరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కే.నాగేంద్రరరావు తెలిపారు. ఎక్కడైనా మిస్సింగ్, తప్పిపోయిన కేసు తరఫువారు నకరికల్లు పోలీసులను సంప్రదించాలని కోరారు.



ఎమ్మెల్యే యరపతినేనికి వినతిపత్రం అందజేస్తున్న వైద్యాధికారులు

జీవో 85ను రద్దు చేయండి

● ఎమ్మెల్యే యరపతినేనికి వైద్యాధికారుల వినతి

మాచవరం, ఆగస్టు 3: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.85ను రద్దు చేసి తమకు న్యాయం చేయాలంటూ మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. శనివారం ఎన్డీఏ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే యరపతినేని హాజరుకాగా వైద్యాధికారులు ఆయనను కలిసి తమ సమస్యలను విన్నవించారు. ముఖ్యంగా జీవో 85 అమలుతో పీజీ సర్వీసు తగ్గుతుందని, దీనివల్ల వైద్యాధికారులు నష్టపోతారని, ఆ జీవోను రద్దుచేయించి తమకు న్యాయం చేయాలంటూ వారు ఎమ్మెల్యేను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వైద్యాధికారులు ప్రసాదరావు, అన్వేష్, నస్రీన్ పాల్గొన్నారు.

సాగు నీటిని విడుదల చేయాలి

మాచర్ల రూరల్, ఆగస్టు 3: సాగర్ కుడి కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా పల్నాటి ప్రాంత రైతాంగం సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయకట్టు కింద ఉన్న సుమారు 20 లక్షల ఎకరాలు బీడు భూములుగా మారాయన్నారు. ఖరీఫ్ సీజన్‌కైనా అధికారులు సకాలంలో నీటిని విడుదల చేయాలని కోరారు.

నేడు ఆర్యవైశ్య నేతల సమావేశం

మాచర్లటౌన్, ఆగస్టు 3: పట్టణంలోని కోదండ రామాలయంలో ఆదివారం ఉదయం 11 గంటలకు ఎన్డీఏ కూటమి ఆర్యవైశ్య నేతల సమావేశం నిర్వహించనున్నట్లు సూరె యలమంద శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్డీఏ భాగస్వామ్య ఆర్యవైశ్య నేతలు ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.



ఫ్రెషర్స్‌డేలో మాట్లాడుతున్న గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

● ఫ్రెషర్స్‌డే వేడుకల్లో గుంటూరు మాజీ మేయర్ నాగరాజు

సత్తెనపల్లి, ఆగస్టు 3 : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు అన్నారు. పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాల ప్రెషర్స్ డే వేడుకలు శనివారం స్థానిక కాకతీయ కల్యాణమండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ వీరవల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ చదువు భవిష్యత్‌కు మలుపు అన్నారు. తల్లిదండ్రుల ఆకాంక్ష మేరకు విద్యార్థులు ఉన్నతంగా చదువుకొని గమ్యానికి చేరుకోవాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కావూరు రాజేంద్రప్రసాదు, యనమదల వెంకట్రామయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

తప్పుడు ఫిర్యాదుతో

మనస్తాపం చెంది వ్యక్తి మృతి

పిడుగురాళ్ల, ఆగస్టు 3: తప్పుడు ఫిర్యాదు కారణంగా మనస్తాపం చెంది వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణ సమీపంలోని ఆదర్శ నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదర్శనగర్‌లో ఉండే పెండ్రా మునలయ్య (45)పై అదే ప్రాంతానికి చెందిన బుల్లయ్య అనే వ్యక్తి తన పందులను దొంగిలించాడని ఫిర్యాదు చేశాడు. పిడుగురాళ్ల పోలీసులు బుల్లయ్య ఫిర్యాదు మేరకు పెండ్రా మునలయ్యను స్టేషన్‌కు పిలిపించి విచారించారు. అయితే మునలయ్య దొంగతనం చేయలేదని గుర్తించి ఇంటికి పంపించారు. తనపై దొంగతనం అపవాదుని మోపారని మనస్తాపం చెంది మునలయ్య శుక్రవారం అర్ధరాత్రి గుళికల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా రామస్వామి జన్మదిన వేడుకలు

సత్తెనపల్లి, ఆగస్టు 3 : మునిసిపల్ మాజీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎలినేడి రామస్వామి జన్మదిన వేడుకలను శనివారం టీడీపీ ప్రజా వేదికలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను రామస్వామి కట్ చేయగా, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆయనకు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజక వర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు రామస్వామికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రామస్వామిని, కన్నా లక్ష్మీనారాయణను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు, చౌట శ్రీనివాసరావు, కోమటినేని శ్రీనివాసరావు, ఎలినేడి శ్రీనివాస్, లక్ష్మి తులసీ, సయ్యద్ పెద కరిముల్లా, రాంబో బుడే, సయ్యద్ మాబూ, ఆతుకూరి నాగేశ్వరరావు, నూర్ బాషా జానీ బాబు, పూజల వెంకట కోటయ్య, మార్కెట్ రాజు, పోట్ల ఆంజనేయులు, బంగారు నాగరాజు, కంభంపాటి అబ్రహం, తురకా మేరీ గ్రేస్, కందిమళ్ళ రజిని, తోట అంబిక, గుజ్జర్లపూడి స్టాలిన్, వక్కంటి అజయ్, పచ్చ సుధీర్, రాంబాబు, మస్తాన్‌వలి, తదితరులు పాల్గొన్నారు.



ఎలినేడి రామ స్వామి జన్మదిన కేక్‌ను కట్ చేసిన ఎమ్మెల్యే కన్నా

విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు

పిడుగురాళ్ల, ఆగస్టు 3: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పిడుగురాళ్ల న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ ఎం.మురళీగంగాధరరావు ఆధ్వర్యంలో శనివారం స్థానిక సూర్యకిరణ్ మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలలో న్యాయ అవగాహనసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మురళీగంగాధరరావు మాట్లాడుతూ మానసిక అనారోగ్యం, మానసిక వికలాంగులకు చట్టపరమైన సేవలు అమలుచేయాల్సి వుందన్నారు. అటువంటి వారికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందుతాయన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమారస్వామి, సూర్యకిరణ్ మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపాల్ డీవీ రవీంద్రప్రసాద్, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఉడతా కోటేశ్వరరావు, న్యాయవాదులు రూత్ బనియన్, కోపూరి వెంకటేశ్వర్లు, జాకబ్, ఎస్వీ కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, ఉపేంద్ర, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న న్యాయాధికారి శ్రీనివాసరావు తదితరులు

డ్రగ్స్, ర్యాగింగ్‌లకు దూరంగా ఉండండి

● గురజాల సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి శ్రీనివాసరావు

గురజాలటౌన్ : ర్యాగింగ్, మాద ద్రవ్యాలు ఎన్నో అనార్ధాలకు మూలమని, విద్యార్థులు వీటికి దూరంగా ఉండాలని గురజాల సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక వాగ్దేవి కాలేజీ ఆఫ్ ఫార్మసీలో నిర్వహించిన ర్యాగింగ్, మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు చట్టాలు, జరిమానాలు, జైలు శిక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీరభద్రుడు, జానీబాషా, సౌందర్‌రాజన్, రవికుమార్, సురేష్, ప్రభుదాసు, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

విద్యాభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి,ఆగస్టు3:విద్యాభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శనివారం ఆయన పాఠ్య పుస్తకాలను, బ్యాగ్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే కన్నా తన సొంత నిధులతో 250 మంది విద్యార్థులకు పుస్తకాలను, నోట్ పుస్తకాలను, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరమ్మ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకు కృషి చేయాలి

● జడ్పీ సమావేశంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, ఆగస్టు 3 : సమాజంలో అవినీతి నిర్మూలనకు ప్రతి పౌరుడు కృషి చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో తీవ్ర స్థాయిలో అవినీతి జరిగిందని, స్థానిక సంస్థలు నిర్వీర్యమయ్యాయని, వాటిని తిరిగి బలోపేతం చేయాలన్నారు. గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే వైసీపీ జడ్పీటీసీలు, ఎంపీ పీలు ఎమ్మెల్యేలతో కలసి పనిచేయాలని సూచించారు.సర్వసభ్య సమావేశంలో కేంద్ర మంత్రి, రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, జడ్పీ చైర్ పర్సన్, ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సీలు పాల్గొన్నారు.

పారుపల్లిలో వైద్య శిబిరం

క్రోసూరు, ఆగస్టు 3 : మండలంలోని పారుపల్లిలో క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. గతంలో గ్రామంలో అంటువ్యాధులు ప్రబలినందున ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా వైద్యశిబిరం ఏర్పాటుచేసినట్లు వైద్యాధికారి డాక్టర్ బేగ్ తెలియజేశారు. గ్రామంలో సుమారు వంద మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని, రక్త నమూనాలను సేకరించామని డాక్టర్ సిరిచందన తెలియజేశారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా అవగాహన కల్పించామన్నారు. మురుగు నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఎబాట్ ద్రావణాన్ని పిచికారి చేయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఏఎన్ఎంలు, ఆషా వర్కర్లు, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఐ వెంకట ప్రసాదుకు సత్కారం

అచ్చంపేట, ఆగస్టు 3: అచ్చంపేట మండల సీఐగా బాధ్యతలు స్వీకరించిన కే.వెంకట ప్రసాదును శనివారం టీడీపీ నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, వెనిగండ్ల కోటయ్య, తాళ్ళూరి లక్ష్మీనారాయణ, బత్తుల శ్రీనివాసరావు, సందెపోగు సామేలు, బత్తుల కోటేశ్వరరావు, మూడావత్ బాలూ నాయక్, పొన్నెకంటి శ్రీనివాసరావు, నెల్లూరి వెంకటయ్య, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.



బోనస్‌లు పంపిణీ చేస్తున్న డైరెక్టర్ పులుకూరి శ్రీనివాసరావు తదితరులు

సంగం డెయిరీ బోనస్‌ల పంపిణీ

మాచవరం, ఆగస్టు 3: మండలంలోని కొత్తపాలెం, మాచవరం గ్రామాలలో శనివారం సంగం డెయిరీ డైరెక్టర్ పులుకూరి శ్రీనివాసరావు ఉత్పత్తిదారులకు బోనస్‌లు పంపిణీ చేశారు. పాలకొత్తపాలెం గ్రామంలో రూ.37,14,994 గాను రూ.3,71,496, మాచవరంలో రూ.23,54,576 పాల బట్వాడకు గాను రూ.94, 186, కొత్తపాలెం మరో సెంటర్‌లో రూ.23,95,860 పాల బట్వాడకు గాను రూ.2,39,586 బోనస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంగం డెయిరీ గ్రామ అధ్యక్షుడు మునగాల సాంబయ్య, సర్పంచ్ యామని రామారావు, కొత్తపాలెం సంగం డెయిరీ అధ్యక్షుడు రమణయ్య, జే.వెంకటేశ్వర్లు, రంగారావు, కర్రి శ్రీను, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలు రేటు పెంచాలి

బెల్లంకొండ, ఆగస్టు 3 : దేవాదాయశాఖ భూముల కౌలు రేటును రైతులు పెంచితే ఆ నగదు దేవాలయాలకు ఉపయోగపడుతుందని దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ లీలావతి తెలిపారు. శనివారం బెల్లంకొండలో నిర్వహించిన ఆలయ భూముల కౌలు వేలంలో ఆమె పాల్గొన్నారు. బెల్లంకొండ వీరభద్రుని దేవస్థానం బెల్లంకొండ, నాగవరం గ్రామాలకు చెందిన దేవాలయ భూముల 30.98 సెంట్లకు రూ.2,45,100, నాగేశ్వర స్వామి వారి 9.25 ఎకరాలలో రూ.36,300లకు కౌలుదారులు తీసుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఈవో వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది జాలయ్య, అటెండర్ తెల్లమేకల గోపీ పాల్గొన్నారు.

డీఈవో కార్యాలయంలో అవినీతిపై విచారణ జరిపించాలి

● ఫ్యాప్టో జిల్లా చైర్మన్ సంపత్‌బాబు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 3: పల్నాడు జిల్లా డీఈవో కార్యాలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమ డిప్యూటేషన్లపై సమగ్ర విచారణ జరపాలని ఫ్యాప్టో పల్నాడు జిల్లా చైర్మన్ బెజ్జం సంపత్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం గుంటూరులో ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డికి ఫ్యాప్టో నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్ మక్కెన శ్రీనివాసరావు, కో చైర్మన్ టీ చంద్రయ్య, షేక్ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి మహతి

వినుకొండ, ఆగస్టు 3: పట్టణంలోని జూనియర్ కళాశాలలో జాతీయ లీగల్ అథారిటీ న్యూఢిల్లీ, రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ వారి సూచనలతో న్యాయవిజ్ఞాన సదస్సుపై విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన న్యాయమూర్తి మహతి మాట్లాడుతూ యువత డ్రగ్స్ వాడడం వల్ల తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, మంచి నడవడికను అలవరుచుకోవాలని తెలిపారు. డ్రగ్స్ మహమ్మారిపై జాగ్రత్తగా ఉండాలని, డ్రగ్స్ వాడటం వల్ల ఎన్నో కుటుంబాలు చితికి పోయాయని, మెదడు మందగిస్తుందని న్యాయమూర్తి తెలిపారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు కేఎస్ఎన్‌వీ నాయుడు, సెక్రటరీ పఠాన్ గౌస్ మొహిద్దీన్‌ఖాన్, న్యాయవాదులు, కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

నాదెండ్ల, ఆగస్టు 3: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని చిలకలూరిపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఐ స్వాతి అన్నారు. మండలంలోని చుండి రంగ నాయకులు కళాశాలలో చిలకలూరిపేట మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సీఆర్ కళాశాలలో శనివారం మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన సదస్సును విద్యార్థులు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం శ్రీనివాసరావు, న్యాయవాదులు ఎం భాను ప్రసాదు, పీ వెంకట్, జీవీ ప్రసాదు, బీ రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలి

● ఎంఈవో సాంబశివరావు

శావల్యాపురం, ఆగస్టు 3: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 8వ తేదీన జరగనున్న ఎస్‌ఎంసీ ఎన్నికలను ఎటువంటి రాజకీయ ప్రలోభాలకు తలొగ్గకుండా హెచ్‌ఎంలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు అన్నారు. స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో మండలంలోని అన్ని జడ్పీ, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ ఎస్‌ఎంసీ ఎన్నికలను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆధార్ లేదా ఓటర్ కార్డులు తీసుకొని ఎన్నికలకు హాజరవ్వాలన్నారు. అనంతరం ఇప్పటివరకు పాఠశాలల్లో చేరని బడి బయటి పిల్లలను గుర్తించి కారణాలు కనుక్కొని వారిని పాఠశాలల్లో చేర్పించేలా కృషి చేయాలన్నారు. ఎంఈవో-2 పుసులూరి లలితకుమారి మధ్యాహ్న బోజనంలో ఎండీఎం ఆపరేటర్లు ప్రభుత్వ మెనూ పాటించేలా, వంటకాలు నాణ్యతగా, రుచిగా ఉండేలా పర్యవేక్షించాలన్నారు. హెచ్‌ఎంలు విజయలక్ష్మి, అన్నపూర్ణమ్మ, ఉమామహేశ్వరరావు, సుభానీ, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు వైసీపీ అండగా ఉంటుంది

● మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ, ఆగస్టు 3: వినుకొండ పట్టణంలో ఇటీవల హత్యకు గురైన రషీద్ కుటుంబసభ్యులకు రూ.2లక్షల చెక్కును వైసీపీ కార్యాలయంలో శనివారం మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రషీద్ హత్య గురించి తెలియగానే స్పందించి మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి రషీద్ కుటుంబాన్ని పరామర్శించి వారికి ఆర్థికసాయం చేశారన్నారు. అనంతరం విలేకర్ల సమావేశంలో బొల్లా మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయని, సామాన్యులకు రక్షణ లేకుండా పోతుందని విమర్శించారు.

గుండ్లకమ్మలో ఇసుక రవాణా నిషేధం

● తరలింపు దారులపై కేసులు నమోదు చేస్తాం : ఆర్డీవో సరోజిని



గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నూజెండ్ల, ఆగస్టు 3: గుండ్లకమ్మ నదిలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక రవాణాను ఆపి వేయాలని ఆర్డీవో సరోజిని అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం గ్రామంలో గుండ్లకమ్మ నుంచి ఇసుక రవాణా చేసే మార్గంలో రహదారి వివాదంగా మారి వాగ్వివాదం, ఘర్షణ వాతావరణం నెలకొనటంతో ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని గుండ్లకమ్మ నదీ పరివాహక ప్రాంతానికి చేరుకొని తగు చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. మూడు రోజుల క్రితం వైసీపీకి చెందిన వారు తమ భూములకు గుండ్లకమ్మ నీటిని తరలించేందుకు పైపు లైన్ వేయటానికి ప్రయత్నిస్తున్న సందర్భంలో టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సంఘటన నేపథ్యంలో శనివారం ఉదయం టీడీపీకి చెందిన ట్రాక్టర్ యజమాని గుండ్లకమ్మ ఇసుక తరలింపునకు రావటంతో వైసీపీ వారు తమ భూముల్లో రహదారి మార్గం లేదని అడ్డుకోవటంతో ఈ సమాచారాన్ని గ్రామస్థులకు తెలియ జేయటంతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పెద్ద సంఖ్యలో ట్రాక్టర్లతో రావటంతో వాగ్వివాదం, ఘర్షణ వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న నరసరావుపేట ఆర్డీవో సరోజిని, అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి, మైనింగ్ ఏడీ నాగినిలు అక్కడకు వచ్చి ఘర్షణలను నివారించి నదీ పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు. మైనింగ్ శాఖ అధికారులు ఇసుక నాణ్యతను పరిశీలించి గుండ్లకమ్మ నదిలో లభించే ఇసుక గృహ నిర్మాణాలకు పనికి రాదని, ఈ నదీ పరివాహక ప్రాంతంలో లభించే ఇసుక గలస మాత్రమేనని నిర్ధారించారు. నదీ పరివాహక ప్రాంతాల్లో యంత్రాల వినియోగం నిషేధించిన దృష్ట్యా ఎడ్ల బండ్లు రవాణాకు సరైన పరిస్థితులు లేక పోవటంతో ఈ ప్రాంతంలోకి ట్రాక్టర్లు, భారీ వాహనాలను రాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆర్డీవో సరోజిని రెవెన్యూ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం లక్ష్మీనారాయణరెడ్డి, డీటీ ఎం అర్జున్‌నాయక్, ఆర్ఐ రామారావు, వీఆర్వో బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్ ర్యాలీ



యాంటి ర్యాగింగ్ ర్యాలీ నిర్వహిస్తున్న ఏఎం రెడ్డి విద్యాసంస్థల విద్యార్థులు, అధ్యాపకులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 3 : స్థానిక ఏఎంరెడ్డి విద్యాసంస్థల్లో శనివారం ర్యాగింగ్, డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీలు నిర్వహించారని విద్యాసంస్థల సెక్రటరీ అట్లూరి శాంతి తెలిపారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ మల్లికార్జున మాట్లాడుతూ ర్యాగింగ్, దాని పర్యవసానాల గురించి వివరించారు. డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ ద్వారా విద్యార్థులకు డ్రగ్స్ తీసుకోవడం ద్వారా జరిగే అనర్థాల గురించి ఫార్మసీ ప్రిన్సిపాల్ భార్గవ భూషణ్ చెప్పారు. విద్యాసంస్థల్లో ఇటువంటి ర్యాలీల ద్వారా విద్యార్థులకు అవగాహన కలిగించడం, అదేవిధంగా సమాజానికి సందేశాన్ని అందించడం సంతోషాన్ని కలిగించిందని డిప్లమో ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌పై అవగాహన ర్యాలీ

నరసరావుపేట లీగల్, ఆగస్టు 3: రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు శనివారం స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని మొదటి రైల్వే గేట్ వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ మహాత్మా గాంధీ విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి ఎన్ సత్యశ్రీ మాట్లాడుతూ భవిష్యత్తులో ర్యాగింగ్ సంఘటనలు జరగకుండా ఉండాలనే ఆశిస్తూ రాగింగ్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక న్యాయాధికారులు కే మధుస్వామి, ఆర్ ఆశీర్వాదం పాల్, టి.ప్రవళిక, పల్నాడు జిల్లా క్రైమ్ ఏ ఎస్ పి.లక్ష్మీపతి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు లక్ష్మీ రామ్‌నాయక్, ఎన్ విజయ్‌కుమార్ న్యాయవాదులు, లీగల్ వలంటీర్లు, పోలీస్ అధికారులు పలు కళాశాలల యాజమాన్యం ఉపాధ్యాయులు, విద్యార్థులు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం.. వృద్ధురాలి మృతి



పేరమ్మ(ఫైల్ ఫొటో)

నూజెండ్ల, ఆగస్టు 3: విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తెగిపోయిన 11కేవీ విద్యుత్ వైర్‌ను అలాగే వదిలి వేయటంతో వృద్ధురాలిని బలి తీసుకుంది. మండలంలోని పమిడిపాడు గ్రామానికి చెందిన గంగ వరపు పేరమ్మ(63) శనివారం ఉదయం సాగర్ జలాలు వస్తుండటంతో ఊరి పక్కనే ఉన్న ఆరెకరాల జామాయిల్ తోటకు నీటి సరఫరాను పరిశీలించేందుకు వెళ్లింది. మూడు రోజుల క్రితమే తన పొలంలో విద్యుత్ వైరు తెగిపడి ఉన్నదని పేరమ్మ కుమారుడు చంద్రశేఖర బాబు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు, సిబ్బంది స్పందించి సరఫరాను నిలుపుదల చేయలేదు. దీంతో పొలంలోకి వెళ్ళిన పేరమ్మ విద్యుతాఘాతానికి గురిచని పోవటంతో సమీపంలో ఉన్న బంధువైన ఎండ్లూరి వీరయ్య పేరమ్మను రక్షించేందుకు వెళ్ళగా తనకు కూడా విద్యుత్ షాక్‌తో తీవ్ర గాయాలయ్యాయి. వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుమారుడు చంద్రశేఖర్ బాబు ఫిర్యాదు మేరకు ఐనవోలు ఎస్ఐ ఎం లక్ష్మీనారాయణరెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని వినుకొండ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. విద్యుత్ షాక్‌తో పేరమ్మ మృతి చెందిన విషయం తెలిసిన మండల ప్రజలు విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంగా కారణంగా ప్రమాదంగా మారిన తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లతో అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్‌శాఖ అధికారులు ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సన్నిధిని ప్రభుత్వం ఆదుకోవాలి

రొంపిచర్ల, ఆగస్టు 3: మండలంలోని అన్నవరప్పాడు గ్రామానికి చెం దిన సరిమెళ్ళ సన్నిధి సంతగుడిపాడు కేజీబీవీ పాఠశాలలో 10వ తర గతి వరకు విద్యనభ్యసించింది. పరీక్షల సమయంలో ఆమెకు ఆరోగ్యం బాగా లేకపోవటంతో ప్రిన్సిపాల్‌కు తెలియజేసినా తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వలేదని పేర్కొంది. పరీక్షల అనంతరం ఆమెకు జ్వరం రాగా అనారోగ్యం పాలైంది. నరసరావుపేట, ప్రకాశం జిల్లాలో పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకుండా పోయిందని తల్లిదండ్రులు కోటయ్య, మరియకుమారి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తమ కుమార్తెకు వైద్యసాయం చేయించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. సదరు ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మంచానికి పరిమితమైన తమ కుమార్తెను చూస్తే తల్లడిల్లి పోతున్నామని తెలిపారు. ఇప్పటి వరకు సుమారు రూ.8 లక్షల వరకు వైద్యానికి ఖర్చయిందని పేర్కొన్నారు. శరీరంలోని భాగాలు పాడైపోయినట్టు వైద్యులు చెపుతున్నారన్నారు. పాఠశాలల్లో విద్యార్థులపై సంబంధిత ప్రధానోపాధ్యాయులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు.

బియ్యం అక్రమ రవాణా.. కేసు నమోదు

నూజెండ్ల, ఆగస్టు 3 : మండలంలోని భూమాయపాలెం వద్ద రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఐనవోలు ఎస్ఐ ఎం లక్ష్మీనారాయణరెడ్డి శనివారం తెలిపారు. తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న డ్రైవర్ పరారు కాగా ఆటోను, రేషన్ బియ్యాన్ని ఐనవోలు పోలీసు స్టేషన్‌కు తరలించామన్నారు.

నేడు, రేపు సీపీఐ సమావేశాలు

చిలకలూరిపేట, ఆగస్టు 3: నరసరావుపేటలోని సీపీఐ కార్యాలయంలో ఈనెల 4, 5 తేదీల్లో పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్నట్టు పార్టీ ఏరియా ఇన్‌చార్జ్ కార్యదర్శి నాగభైరు రామ సుబ్బాయమ్మ శనివారం తెలిపారు. పార్టీ నాయకులు ముప్పాళ్ళ నాగేశ్వర రావు, జంగాల అజయ్‌కుమార్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

కేరళలోని వయనాడ్‌లో జరిగిన వరద బీభత్స బాధితులకు సహాయార్థం పట్టణ సీపీఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రతాపరెడ్డి, విల్సన్, భారతి, కోటానాయక్, దుర్గాబాయి పాల్గొన్నారు.

రామిరెడ్డిపేటలో అర్ధరాత్రి ఘర్షణ

నరసరావుపేట లీగల్, ఆగస్టు 3: పట్టణంలో రామిరెడ్డిపేటలో శనివారం అర్ధరాత్రి యువకుల మధ్య ఘర్షణ జరిగింది. 1వ పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణాజిల్లా నందిగామ నుంచి పట్టణానికి చెందిన వ్యక్తి పశువుల దానాను తన ఆటోలో తీసుకువచ్చి వ్యాపారం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి రామిరెడ్డిపేట నుంచి పాలపాడు వైపు ఆటో వెళ్తుండగా వాటర్ ట్యాంక్ వద్ద గ్రామానికి చెందిన కొందరు యువకులు మద్యం తాగి ఆటోను ఆపి డ్రైవర్‌తో గొడవపడ్డారు. దీంతో ఆటో డ్రైవరు బయపడి ఆటో యజమానికి ఫోన్ చేసి వారికి ఇచ్చాడు. ఆటో యజమానిని యువకులు దూషించి ఆటోను పాలపాడు రోడ్డు నుంచి రామిరెడ్డిపేట సెంటరుకు తీసుకువచ్చారు. ఆటో యజమాని పట్టణంలో ఉన్న తన సోదరులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆటో వద్దకు వచ్చారు. దీంతో ఇరువురు మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటన గురించి సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న ఎస్పీ తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాల్సిందిగా సీఐకి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సీఐ చరణ్ ఇరుపక్షాలకు చెందిన వ్యక్తులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై హర్షం



అంబేద్కర్ విగ్రహం పాలాభిషేకంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింతిరాల మీరయ్య తదితరులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 3 : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పుపై మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి జిల్లా అధ్యక్షుడు చింతిరాల మీరయ్య హర్షం వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతిరాల మీరయ్య మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా వర్గీకరణ కీలక ఘట్టమ న్నారు. 1997లో ఎస్సీ వర్గీకరణ చేసిన వ్యక్తి నారా చంద్రబాబునాయు డు అని, అలాంటి వ్యక్తి మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం మాదిగలు, ఉపకులాల వరమన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సుబ్బు మాదిగ, కొండెపోగు రమణారావు, దావల రవికుమార్, డీ రమణయ్య, మల్లెల మధు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం : పీడీ ఉమారాణి

ఈపూరు, ఆగస్టు 3: తల్లి పాలు బిడ్డకు ఆరోగ్యమని మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ పల్నాడు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కే ఉమారాణి అన్నారు. ఈపూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బొల్లాపల్లి, ఈపూరు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలకు శనివారం ఈపూరు వ్యవసాయ మార్కెట్‌యార్డు నందు ప్రపంచ తల్లిపాల వారోత్సవాల అవగాహన, ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీడీ కే ఉమారాణి హాజరయ్యారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో అరుణ, సూపర్‌వైజర్లు చిన్నమ్మాయి, రాజ్యలక్ష్మి, శ్రీదేవి, పద్మజారాణి, మస్తాన్‌బీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు

రొంపిచర్ల, ఆగస్టు 3: మండలంలోని రొంపిచర్ల, సంతగుడిపాడు గ్రామాల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను శనివారం నిర్వహించారు. సూపర్‌వైజర్ శవిదేవి మాట్లాడుతూ తల్లిపాల రోగ నిరోధక శక్తిగా ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

ఆటో వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

వినుకొండ, ఆగస్టు 3: ఆటో వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు ఏపూరి గోపాలరావు అన్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఆటో డ్రైవర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన గోపాలరావు మాట్లాడుతూ ఉపాధి కోసం చాలా మంది యువకులు ఆటోడ్రైవర్లుగా మారుతున్నారని, దీనివల్ల పట్టణాల్లో ఆటోల సంఖ్య పెరిగిందని, పెరుగుతున్న ఆటోలకు అనుగుణంగా ప్రధాన సెంటర్లలో ట్రాపిక్‌కు ఇబ్బంది కలుగకుండా అధికారులు ఆటోస్టాండ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు అంగలకుదురు ఆంజనేయులు, బంకూరి వెంకటేశ్వర్లు, రత్నబాబు పాల్గొన్నారు.

గిరిజనులకు వైద్యశిబిరాలు



సమావేశంలో జడ్జి కే నరేంద్రరెడ్డి

చిలకలూరిపేట, ఆగస్టు 3: పట్టణంలోని పురుషోత్తమపట్నం, సుగాలీ కాలనీల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కే నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. గిరిజనుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఈ రెండు వైద్య శిబిరాల్లో పెద్ద సంఖ్యలో రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వాడిన కొబ్బరి బోండాలను దూరంగా పడ వేయాలని కోరారు. ఆయా ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు రాణి సంయుక్త, సాయి కిరణ్ వైద్య పరీక్షలు చేయగా పట్టణ ఎస్ఐ సుమన్, న్యాయవాదులు వెంకట్, జీవీ హెచ్‌ఎస్ ప్రసాదు, భాను ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



మిషన్‌తో ఫాగింగ్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేటటౌన్, ఆగస్టు 3 : నరసరావుపేట పట్టణంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ శనివారం నిర్వహించారు. 7, 10, 19, 20, 28 వార్డులలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దోమల కారణంగానే వ్యాధులు వ్యాప్తి తీవ్రమవుతున్నాయన్నారు. దోమలు పెరిగే ప్రాంతాలన్నింటినీ ఫాగింగ్ చేసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కొట్టా కిరణ్‌కుమార్, మాతంగా బంగారం, పారిశుధ్య కార్మికులు, మున్సిపల్ అధికారులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

సార్వత్రిక విద్యాపీఠం ప్రవేశాలకు అడ్మిషన్లు

● కరపత్రాలను ఆవిష్కరించిన కలెక్టర్ అరుణ్‌బాబు



కరపత్రాలు, గోడప్రతులు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు, డీఈవో ఎం వెంకటేశ్వర్లు, సార్వత్రిక విద్యాపీఠం సమన్వయకర్త హుస్సేన్ తదితరులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 3 : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం 2024-25 విద్యా సంవత్సరం అడ్మిషన్ల కోసం శనివారం పల్నాడు జిల్లా నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశం భవనంలో కలెక్టర్ పీ అరుణ్‌బాబు అభ్యాసకుల అడ్మిషన్ల కరపత్రాలను, గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణ్‌బాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూర విద్యావిధానం) ద్వారా 2024-25 సంవత్సరానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్మీయట్ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దగ్గరలో ఉన్న గ్రామ, వార్డు సచివాలయం లేదా ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కాలేజీలో గల సార్వత్రిక విద్యాపీఠం ఏఎల్ సెంటర్లో వివరాలు అందజేసి ప్రవేశాలు పొందాలని తెలియజేశారు. ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తి చేయడానికి ఆగస్టు 27 చివరి తేదీ అన్నారు. అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించుటకు తుది గడువు ఆగస్టు 28 వరకు ఉందన్నారు. కరపత్రాలు ఆవిష్కరణ కార్యక్రమంలో డీఆర్వో కే వినాయకం, డీఈవో ఎం వెంకటేశ్వర్లు, సార్వత్రిక విద్యాపీఠం సమన్వయకర్త కేఎంఏ హుస్సేన్, జిల్లా అకడమిక్ కోఆర్డినే టర్ పీ శ్రీనివాసరావు, జిల్లా ఆల్టర్నెట్ స్కూల్స్ కో ఆర్డినేటర్ కే శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

నాదెండ్ల, ఆగస్టు 3: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా గణపవరం గ్రామంలోని మరబావి సెంటర్, ఎస్సీ కాలనీ, వెటర్నరీ హాస్పటల్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8:30 నుంచి సాయంత్రం 5:50 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. నాదెండ్ల సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా జంగాలపల్లి, చిరుమామిళ్ళ, సంక్రాంతిపాడు గ్రామాల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఆయన వివరించారు.

రూరల్ సీఐగా సుబ్బనాయుడు బాధ్యతల స్వీకరణ



సీఐ సుబ్బనాయుడు

యడ్లపాడు, ఆగస్టు 3: సాధారణ బదిలీల్లో భాగంగా చిలకలూరిపేట రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన సుబ్బనాయుడు తొలిసారిగా యడ్లపాడు స్టేషన్‌ను సందర్శించారు. శనివారం స్టేషన్‌కు వచ్చిన ఆయనకు ఇన్‌చార్జి ఎస్ఐ బాలకృష్ణ, సిబ్బంది స్వాగతం పలికారు. ముందుగా స్టేషన్ రికార్డులను, పరిసరాలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎటువంటి గొడవలకు వెళ్లొద్దని ప్రజలకు సూచించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తెలియపరచాలని కోరారు. మైనర్‌లకు వాహనాలు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డయేరియాపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్వచ్ఛభారత్ రిసోర్స్ కోఆర్డినేటర్ ప్రభాకర్‌రావు

వినుకొండ టౌన్, ఆగస్టు 3: మండలంలోని విఠంరాజుపల్లి ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం డయేరియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, మలేరియా, డెంగీ, డయేరియా తదితర వ్యాధుల భారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసరావు, బాలేశ్వరనాయక్, ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంపూర్ణ గీతాపారాయణంలో చిన్నారి ప్రతిభ

● చికాగోలో జరిగిన పోటీల్లో విజేతగా నిలిచిన పోపూరి నిత్య



ప్రశంసాపత్రంతో పోపూరి నిత్య

యడ్లపాడు, ఆగస్టు 3 : భగవద్గీతపై నిర్వహించిన సంపూర్ణ గీతాపారాయణంలో తొమ్మిదేళ్ల చిన్నారి పోపూరి నిత్య ప్రతిభ కనబరచింది. గణపతి సచ్చిదానంద స్వామి ఆధ్వర్యంలో జూలై 20న చికాగోలోని కృష్ణదత్త హనుమాన్ దేవాలయంలో భగవద్గీతలోని గీతా పారాయణంలోని శ్లోకాల అభినయం(మోనో యాక్షన్) పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పాలపర్తి గ్రామానికి చెందిన పోపూరి బసవయ్య, రామకోటేశ్వరమ్మల మనమరాలు నిత్య గీతా శ్లోకాలను అత్యద్భుత అభినయంతో ప్రదర్శించి విజేతగా నిలిచింది. ఆమెను స్వామీజీ ఆశీర్వదించి ప్రశంసాపత్రాన్ని అందజేశారన్నారు. నిత్య తల్లిదండ్రులు అమెరికాలోని డల్లాస్‌లో ఉంటున్నారు. శ్లోకాలను అభినయంతో ప్రదర్శించే కళకోసం నిత్య సుమారు ఏడాది కాలంపాటు శిక్షణ పొందినట్లు ఆమె తాతయ్య నాయనమ్మలు తెలిపారు.

మానవతా విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి

● అసిస్టెంట్ ప్రొఫెసర్ మల్లికార్జునరావు

వినుకొండ, ఆగస్టు 3: విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని రాజమండ్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలోని విశ్వసాయి జూనియర్ కళాశాల్లో విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అనే అంశంపై శనివారం అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మల్లికార్జునరావు మాట్లాడుతూ విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలని, తల్లిదండ్రులు, గురువులతో గౌరవంగా మెలగాలన్నారు. మల్లికార్జునరావును కళాశాల డైరెక్టర్ యడవల్లి శ్రీనివాసశర్మ, ప్రిన్సిపాల్ శ్రీవల్లి పావనీలు ఘనంగా సత్కరించారు.